J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 37 16.02.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## సంస్కరణల 'సింహాని'కి 'భారతరత్న'



తెలుగుజాతి కీర్తి..
నవభారత నిర్మాణానికి స్ఫూర్తి
**పి.వి.నరసింహారావు**

12 లో

నిన్నటి వరకు
'జగనన్నే మా భవిష్యత్తు' - 'మా నమ్మకం నువ్వే జగన్'.. అన్న
వైసీపీ నాయకుల్లో.. ఇప్పుడు

# ఆ నమ్మకం తగ్గిందా?

సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ ఆంధ్ర రాజకీయాలు చిత్ర విచిత్ర మలుపులు తిరుగుతున్నాయి. ఓ వైపు... అధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీని గద్దెదింపడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక గొడుగుకిందకి చేరే ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నాయి. మరోవైపు... గత ఎన్నికలలో తిరుగులేని పార్టీగా అవతరించి 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిపై సొంత పార్టీ నేతలే తిరుగుబాటు చేయడం ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతున్నాయి.

10 లో





తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అభ్యర్థులుగా
నెల్లూరు నుండి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
ఒంగోలు నుండి మాగుంట రాఘవరెడ్డి ?

3 లో



# సర్వేపల్లిలో టీడీపీ జెండా ఎగరాలి

## పార్టీ శ్రేణులకు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దిశానిర్దేశం



రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని, సర్వేపల్లి నియోజకవర్గంలో కూడా టీడీపీ జెండా ఎగరాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన పొదలకూరు మండలంలోని తెలుగు యువతతో నెల్లూరులో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాబోయే 45 రోజులు ఎంతో కీలకమని, టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని ఆయన కోరారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా తెస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, పరిశ్రమలకు పెద్దపీట వేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైకాపా అధినేత ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. మెగా డీఎస్సీ అని చెప్పి దగా డీఎస్సీని నిర్వహిస్తున్నారని, కనీసం సిలబస్ చదివేదానికి కూడా సమయం లేకుండా కేవలం 20 రోజుల్లో టెట్ పరీక్షలు పెట్టడం ఏమిటని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఈ అరాచక పాలన నుండి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు అందరూ కంకణబద్ధులు కావాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

# టీడీపీ.. ప్రభంజనంలా రాబోతోంది!

## --- బీసీ శంఖారావంలో దినేష్‌రెడ్డి ---



తెలుగుదేశం పార్టీ ప్రభంజనంలా రాబోతోందని, రానున్న ఎన్నికల్లో గెలుపు టీడీపీదే నని కోవూరు టీడీపీ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి చెప్పారు. ఈనెల 11న కోవూరులో 'జయహో బీసీ' పేరుతో పెద్దఎత్తున ఏర్పాటైన బీసీల శంఖారావం సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం రాష్ట్రానికి అవసరమన్నారు. భవిష్యత్ గ్యారంటీతో పాటు సూపర్‌సిక్స్ పథకాలతో టీడీపీ ప్రజాదరణ పొందుతోం దన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు అగ్రపీఠం ఉంటుందని అన్నారు. ఈ సభలో మాజీమంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని మాట్లాడుతూ, సీఎం జగన్ పాలనలో బీసీలపై దాడులు పెరిగిపోయాయని, టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ చట్టం అమలవు తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలు తమకు అండగా నిలవాలని, ప్రజలు తెలుగుదేశం పార్టీకి విజయం చేకూర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రయాదవ్, నాయకులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, బూదాటి రాధయ్య, జనసేన నాయకుడు మనుక్రాంత్‌రెడ్డి, చెంచలబాబుయాదవ్, చైతన్యకృష్ణ, మల్లారెడ్డి, బాల రవి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

## ● మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల



చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీకి విజయం సాధించిపెట్టాలని మాజీఎమ్మెల్యే.. వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. ఈనెల 12న సైదాపురం మండలం పరిధిలో ఉన్న కలిచేడు గ్రామపంచాయతీలో 'చంద్రబాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో అన్నీ వైఫల్యాలేనని, ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. తొలుత వడ్డెపాళెంలోని రామాలయంలో ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీని పెద్ద మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, దిలీప్‌చౌదరి, రాజశేఖర్‌రాజు, వెంకటేశ్వరరెడ్డి, రమణయ్యనాయుడు, దశయ్యనాయుడు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీలోకి..

# వైసీపీ కార్పొరేటర్

## చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరిక

నెల్లూరులోని 7వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, వారి మిత్ర బృందం ఈనెల 12న తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. హైదరాబాద్‌లోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో, నెల్లూరు నగర నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి.. మాజీమంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. చంద్రబాబునాయుడు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడుతూ, నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి పదికి పది స్థానాలు వచ్చేలా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని మార్గదర్శకం చేశారు. పార్టీకోసం కష్టపడే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు.

## తెలుగుదేశం వస్తేనే..

# సమస్యలకు పరిష్కారం

## - మాజీమంత్రి నారాయణ



తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మాజీమంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. ఈనెల 11న ఆయన నెల్లూరులోని 13వ డివిజన్‌లో పర్యటించి పలువురు చిరువ్యాపారులకు తోపుడు బండ్లను తమ వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నా.. నెల్లూరు నగరంలో ప్రజల సమస్యలు తీరాలన్నా... టీడీపీ ప్రభుత్వం రావాలన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగానే అన్ని వర్గాల ప్రజల సమస్యలు తీర్చేందుకు కృషిచేస్తారని ఆయన భరోసా ఇచ్చారు.

# 'ఉచిత పథకాల' పేరుతో వైకాపా-తెదేపా దగా!

## దుయ్యబట్టిన కాంగ్రెస్ నేత చేవూరు దేవకుమార్‌రెడ్డి



రాష్ట్రంలో అభివృద్ధిని విస్మరించి ఉచిత పథకాల పేరుతో ప్రజలను మోసం చేసి, అధికార, ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నాయంటూ జిల్లా కాంగ్రెస్ నేత, రాష్ట్ర కాంగ్రెస్ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మెన్ చేవూరు దేవకుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. ఈనెల 12న ఆయన నెల్లూరులోని 18వ డివిజన్‌లో పర్యటించి రాష్ట్రంలో వైకాపా, తెదేపాల తీరుపై, కేంద్రంలో బీజేపీపై విమర్శలు గుప్పించారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీలను ఓడించి, ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామన్న బీజేపీ, ఆ హోదా ఇవ్వకుండా మోసం చేస్తే, రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలైన వైసీపీ–టీడీపీలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజల ఆత్మగౌరవాన్ని మంటగొలిపేవిధంగా ఆ పార్టీలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఆంధ్రప్రదేశ్ అంటే అభివృద్ధి అనే విధంగా అన్నిరంగాల్లో ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకువస్తే, నేడు వైసీపీ–టీడీపీ పార్టీల తీరుతో దేశంలోనే అత్యంత అప్పులు కలిగిన రాష్ట్రంగా మాత్రమే కాకుండా, చివరకు రాజధాని కూడా లేని రాష్ట్రంగా అపనిందల పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలైన షర్మిలమ్మను దీవించి, కాంగ్రెస్‌కు విజయం చేకూర్చాలని ఆయన కోరారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్.ఫయాజ్, ప్రధాన కార్యదర్శులు నత్రంబాక మోహన్‌రెడ్డి, అరవదాసు, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# కనీస వసతుల కల్పనలో వైకాపా ప్రభుత్వ వైఫల్యం

## - జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి -



ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం దారుణంగా వైఫల్యం చెందిందని జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 11న ఆయన నెల్లూరులోని 53వ డివిజన్ పరిధిలో ఉన్న గాంధీ గిరిజన సంఘంలో జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబుతో కలిసి 'జనం కోసం జనసేన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, కరెంట్ చార్జీలు షాక్ కొట్టేలా ఉన్నాయన్నారు. పేద ప్రజలకు అందించాల్సిన బియ్యం పలుచోట సక్రమంగా పంపిణీ జరగడం లేదని దుయ్యబట్టారు. ప్రత్యేకించి నెల్లూరు నగరంలో దోమలబెడద తీవ్రంగా ఉందన్నారు. సిబ్బంది అసలు ఫాగింగ్ చేయడం లేదని, బ్లీచింగ్ చల్లడం, పారిశుధ్య పనులు నిర్వహించడం పట్ల అలక్ష్యంగా ఉన్నారన్నారు. దీంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో టిడిపి–జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. నాయకులు షేక్ అలియా, జీవన్, ప్రతాప్, శ్రీకాంత్, అజయ్‌బాబు, ఆనంద్, జహీర్, సుధీర్, సుధాకర్‌రెడ్డి, చంద్రమౌళి, చంద్ర, రమాదేవి, రవి, శశి, సంపత్, నాని తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే ప్రజలకు సంక్షేమం

## ఆత్మకూరులో నాయకుల ప్రచారం



దేశవ్యాప్తంగా ప్రజల అభ్యున్నతి కోసం ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక పథకాలను అమలుచేస్తోందని, రాష్ట్రంలోనూ పేద, బడుగు వర్గాల ప్రజలకు అనేక అభివృద్ధి పథకాలను, ప్రజా సంక్షేమ పథకాలను అందిస్తూ వారి అభివృద్ధికి బీజేపీ బాటలు వేస్తోందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించి గెలిపించాలని ఆత్మకూరులోని బీజేపీ నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 12న ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలంలో ఉన్న నందవరం, డీసీపల్లి, చిన్నమాచనూరు పల్లెల్లో ఆ నియోజకవర్గం బీజేపీ నాయకులు కంది మల్లికార్జున్‌రెడ్డి, కాలం బుజ్జిరెడ్డి తదితరులు బీజేపీ ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు 'పల్లెకు పోదాం' కార్యక్రమంలో భాగంగా వారు పల్లెపల్లెకు, ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ ప్రభుత్వ విధానాలను, చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించారు. దేశంలో గతంలో ఎప్పుడూ ఎవరూ చేయలేనంత అభివృద్ధి కార్యక్రమాలను బీజేపీ అమలుచేసిందని, ప్రజలు గమనించి బీజేపీ అభ్యర్థులకు అఖండ విజయం చేకూర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్.రమేష్‌రెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతిభా'పద్మా'లకు ఆత్మీయ అభినందనలు

భారత ప్రభుత్వం ఇటీవల 'పద్మవిభూషణ్' పురస్కారాలను ప్రకటించిన నెల్లూరు ముద్దుబిడ్డ, భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును, నెల్లూరు దత్తుబిడ్డ, తెలుగుసినిమా రంగానికి పెద్దదిక్కు, మెగాస్టార్ చిరంజీవిని హైదరాబాదులోని వారి నివాసాలలో కలిసి ఆత్మీయ అభినందనలు తెలియజేస్తున్న 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు).



### వైఎస్సార్ సేవాదళ్

## రాష్ట్ర కార్యదర్శిగా ఆర్ఎస్ఆర్



సీఎం జగన్‌తో ఆర్ఎస్ఆర్ (ఫైల్‌ఫోటో)

నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఛైర్మెన్‌గా, నెల్లూరు 20వ డివిజన్ వైకాపా నాయకునిగా విశేష సేవలందిస్తున్న ఆర్ఎస్ఆర్ (రావు శ్రీనివాస రావు)కు పార్టీలో మరో మంచి పదవి లభించింది. అటు ఆధ్మాత్మికంగా ఆయన చేస్తున్న సేవలు, ఇటు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి చేస్తున్న కార్యక్రమాలను గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన్ను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ వైకాపా కేంద్ర కార్యాలయం ఈనెల 14న ఉత్తర్వులిచ్చింది. దీంతో ఆర్ఎస్ఆర్ అభిమానులు, సహచర నాయకులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి తనకు రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి పదవిని అప్పగించినందుకు ముఖ్యమంత్రి జగన్‌కు, అందుకు సహకరించిన నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ఆర్ఎస్ఆర్ ఈ సందర్భంగా తన కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఆదర్శప్రాయులు..

## దామోదరం సంజీవయ్య

మాజీ ముఖ్యమంత్రి, దివంగత దామోదరం సంజీవయ్య ఆదర్శప్రాయులని, ఆయన చూపిన మార్గంలో మనం నడవవలసిన అవసరం ఉందని పలువురు వక్తలు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నెల్లూరు, అంబేద్కర్ భవన్‌లో ఈనెల 14న దామోదరం సంజీవయ్య 103వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్రమశిక్షణ పట్టుదల గలిగిన సంజీవయ్య సేవలు మరువలేనివని కొనియాడారు. ఐటీడీఏ పీవో ఎం. రాణి, సాంఘిక సంక్షేమ ఉపసంచాలకులు రమేష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, ఐసిడిఎస్ పీడీ హేనా సుజన్, గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, వివిధ శాఖల అధికారులు..సిబ్బంది పాల్గొన్నారు.

### తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అభ్యర్థులుగా

## విపిఆర్ - మాగుంట?







నెల్లూరు జిల్లాలోని ఇద్దరు ప్రముఖులు తెలుగుదేశంలో చేరబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి వైసీపీ టిక్కెట్టు నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో ఆయన తెలుగుదేశంలో చేరి తన కుమారుడిని ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా పోటీలో దింపుతారని చాలారోజుల నుండి వినపడుతోంది.

అయితే, తాజాగా వైసీపీ అధిష్టానం వైఖరి పట్ల మనస్తాపం చెందిన రాజ్యసభ సభ్యులు "సేవాభూషణ్" వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కూడా మాగుంట బాటలోనే నడవబోతున్నారని తెలుస్తోంది. తన రాజకీయ భవిష్యత్ కోసం తమ నాయకుడు తెలుగుదేశం పార్టీని వేదికగా చేసుకోబోతున్నట్లుగా ఆయన అనుయాయులు చెప్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న వీపీఆర్ అభిమానులంతా ఆయన నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నామని, ఆయన ఒక్క పిలుపు ఇస్తే తామంతా ఆయన వెంట నడవడానికి సిద్ధంగా ఉన్నామని అంటున్నారు.

బీజేపీ - టీడీపీ - జనసేన ఒక్కటై పోటీ చేయబోతున్నాయని వార్తలు వస్తున్న సమయంలో నెల్లూరుజిల్లాలో చోటు చేసుకుంటున్న కీలక పరిణామాలను రాజకీయ శ్రేణులు ఆసక్తిగా గమనిస్తున్నారు. వీపీఆర్ మరో పార్టీలో చేరినా, చేరకపోయినా ఆయన, మాగుంట వైసీపీ నుండి బయటకి రావడం వైసీపీకి పెద్ద షాక్ అన్న మాట సర్వత్రా వినపడుతోంది. మరో రెండు మూడు రోజులలో స్పష్టత రావచ్చని రెండు కుటుంబాల అభిమానులు ఎదురుచూస్తున్నారు!

## వైకాపా ఓటమి ఖాయం

**బీజేపీ నాయకుల జోస్యం**



రానున్న ఎన్నికల్లో వైకాపాకు ఓటమి ఖాయమని బీజేపీ నాయకులు జోస్యం చెప్పారు. ఈ నెల 14న బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీజేపీ నాయకుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ మాట్లాడుతూ, హత్యలు, అరాచకాలకు వైకాపా నిలయంగా మారిందని, ఆ పార్టీ తీరుపట్ల ప్రజలు విసిగిపోయారని అంటూ వైకాపాను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. వైకాపా అకృత్యాలను బీజేపీ ప్రజలకు స్పష్టంగా వివరిస్తోందని తెలిపారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 22 నుంచి 29వ తేది వరకు నిర్వహించే బీజేపీ ప్రజాపోరు కార్యక్రమం ప్రజలను చైతన్యవంతం చేస్తుందన్నారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి అందిస్తున్న నిధులను, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. కేంద్రం ఇచ్చే నిధులను రాష్ట్రం తనవిగా చెప్పుకోవడం దారుణం అన్నారు. వైకాపా నాయకుల అరాచకాలు ఇక చెల్లవని చెప్పారు. వైకాపా ఇప్పుడు క్లిష్టపరిస్థితుల్లో ఉందని, త్వరలోనే ఆ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కరణం భాస్కర్, బైరి శ్రీనివాస్, గుత్తా అశోక్‌నాయుడు, చిలకా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఆర్ డీఎస్పీగా.. బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావు

ఒంగోలు ఏఆర్ డీఎస్పీగా ఉన్న వెంకటేశ్వరరావును ఇటీవల నెల్లూరుకు బదిలీచేసిన నేపథ్యంలో, ఆయన ఈనెల14న నెల్లూరులో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ డా. కె.తిరుమలేశ్వరరెడ్డిని, ఏఎస్పీ సౌజన్యను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా ఏటూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు 1992లో పోలీసుశాఖలో ఆర్ఎస్ఐగా చేరి, ఆ తర్వాత విజయవాడ, మచిలీపట్నం, ఒంగోలులలో వివిధ విభాగాల్లో పనిచేశారు.

### • శ్రీసిటీ-పార్క్సన్ ప్యాకేజింగ్ పరిశ్రమ వితరణ

## మల్లవారిపాలెం-వెస్ట్‌లో కొత్త అంగన్‌వాడీ భవనం



అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శ్రీసిటీలోని పార్క్సన్ ప్యాకేజింగ్ పరిశ్రమ యాజమాన్యం వారు మల్లవారిపాలెం-వెస్ట్ గ్రామంలో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనం బుధవారం ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్క్సన్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ సెంథిల్, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి నిరీషా, పార్క్సన్ ఫైనాన్స్ హెడ్ సంతోష్, హెచ్ ఆర్ మేనేజర్ ప్రభు చందర్, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్, మల్లవారిపాలెం గ్రామస్థులు పాల్గొన్నారు. నూతన భవనంతో పాటు, అదే ఆవరణలోని పాత అంగన్‌వాడీ భవనానికి, మరుగుదొడ్లకు మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తెచ్చారు. మొత్తంగా నూతన భవనం, పాత భవనం మరమ్మత్తుల కోసం 18.5 లక్షల రూపాయలు వ్యయం చేశారు. ఈ వితరణ పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో పార్క్సన్ పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. విద్య పట్ల వారికున్న శ్రద్ధ, నిబద్ధతను కొనియాడారు. మరిన్ని కంపెనీలు చురుగ్గా ఈ తరహా అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ఇదొక ప్రేరణగా నిలుస్తుందని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు.


లాయర్
ఫిబ్రవరి 16, 2024

# వేసవి తాపం.. దేశంలో తీరని దాహం

అప్పుడే ఎండలు చుర్రుమంటున్నాయి. మండువేసవి ముంచుకొస్తోంది. రానున్న వేసవి మరింత భగ్గుమంటుందని నిపుణులు చెప్తున్నారు. అయితే, ప్రతి ఎండాకాలం దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొనే పెద్ద కష్టం ఏదైనా ఉందంటే అది మంచినీటి సమస్యే. నిద్రమంచం లేచింది మొదలు మంచినీరు తెచ్చుకోవడంతో పల్లె ప్రజల కష్టాలు మొదలవుతున్నాయి. ఎక్కడో దూరప్రాంతాల్లో ఉన్న పంటపొలాల్లో వేసివున్న మోటారు పైపుల్లోంచో, లేదా బావుల్లోంచో నీళ్ళు తెచ్చుకోవాల్సి వస్తోంది. తాగేందుకు, వంట చేసుకునేందుకు, రోజువారీ అవసరాలకు నీళ్ళు లేకుండా ఒక్కరోజు కూడా గడవడం కష్టం కనుక గృహిణులు ఎంత కష్టమైనా సరే, అన్ని బాధలు భరాయిస్తూ బిందెలు, కడవలు చేతపట్టుకుని ఎక్కడ నీళ్ళు దొరుకుతాయో అంతంత దూరం వెళ్తున్నారు. పల్లె పట్టుల్లో ప్రజలు, పట్టణాలు-నగరాల శివారు ప్రాంతాల్లోని పేదలు ప్రతి ఏటా ఎండాకాలంలో నీటి కోసం బాధలు పడుతూనే ఉన్నారు. చాలాచోట్ల తాగే నీళ్లను కూడా డబ్బు పెట్టి కొనుక్కోవడం తప్ప మార్గాంతరం ఉండడం లేదు. నీళ్ళ వ్యాపారులకు ఇది లాభదాయకంగా ఉన్నా, నిరుపేదలకు, కూలినాలి చేసుకుని బతికే బడుగుజీవులకు ఈ పరిస్థితి దుర్భరంగా ఉంటోంది. అయినా, డబ్బులిచ్చినా నీళ్ళు దొరకని ప్రాంతాలకూ దేశంలో కొదవ లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళు గడిచినా ఇప్పటికీ ఎన్నో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి కటకటలు తప్పడం లేదు. దేశం ఆకాశమంత ప్రగతిని సాధించేస్తోందని ఆర్భాటంగా చెప్పుకునే పాలకులు, ప్రజలకు నిత్యం అత్యంత అవసరమైన మంచినీటిని కొరత లేకుండా అందించడంలో మాత్రం నిర్లక్ష్యంగానే ఉండడం ఎంతైనా బాధాకరం. 2025 నాటికి భారత్‌కు మంచినీటి కష్టాలు పెరిగిపోతాయేతప్ప తగ్గేది ఉండదని, ప్రపంచంలో నీటికి కటకటలాడే దేశాల్లో భారత్ ఒకటని తాజాగా నిపుణుల నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత్‌లో 70 శాతం వ్యవసాయానికి, 80 శాతం గృహావసరాలకు భూగర్భ జలాలే ఆధారమని, కానీ అవి అడుగంటిపోతుండడంతో నీటి కటకట ఏర్పడుతుందని చెప్తున్నాయి. రానురాను ప్రపంచవ్యాప్తంగా విపరీతంగా కాలుష్యం పెరిగిపోతున్న కారణంగా వాతావరణంలో భారీగా మార్పులు జరుగుతుండడం, ఎప్పుడూ లేనంతగా భూతాపం పెరిగిపోతుండడం, 'ఎల్నినో' వంటి అసాధారణ పరిస్థితులు కూడా ఏర్పడుతుండడం జరుగుతున్నాయి. రుతువులు కూడా మారిపోయి.. ఎండాకాలం మరింత మండే కాలంగా తయారవుతుండడం ఇటీవలి కాలంలో ఎక్కువైంది. వస్తే అతివృష్టి - లేదంటే అనావృష్టి, వస్తే కరువు.. లేదంటే తుఫాన్ అన్నట్టుగా ఎప్పుడు ప్రకృతి వికృతి అవుతుందో చెప్పలేని పరిస్థితి. అందులోనూ, ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా కలిగిన మనదేశంలో జనావాస ప్రాంతాల్లో అన్ని రకాల అధికార వ్యవస్థలు ఉన్నప్పటికీ, ఆయా ప్రాంతాల్లో నీటి సమస్యలను అధిగమించేందుకు పెద్దగా ఎవరూ చొరవ తీసుకోవడం లేదు. గ్రామస్వరాజ్యం..దేశానికి సురాజ్యం అంటూ గొప్పగా చెప్పుకుంటున్నామే తప్ప, గ్రామాల అభివృద్ధికి మాత్రం పుష్కలంగా నిధులు ఉండడం లేదు. గ్రామాల అభివృద్ధికి దారులు వేసే సర్పంచ్‌ల వ్యవస్థను దిష్టి బొమ్మగా మార్చేయడం వల్ల గ్రామాల స్థితి ఎంతోకాలంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా తయారైవుంది. ప్రతి గ్రామంలోనూ నీళ్ళు, విద్యుత్, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు నేటికీ గగనకుసుమంగానే ఉంటున్నాయి. 'దాహమైనప్పుడు.. బావి తవ్వుకుందాం' అనే రీతిలో పాలకులు ఏళ్ళ తరబడిగా నిమ్మకు నీరెత్తినట్లు నిమ్మళంగా ఉంటున్నారే తప్ప, నీటి వనరుల కల్పనకు చొరవ తీసుకోవడం లేదు. వానలు వచ్చినప్పుడు ప్రతి వర్షపు బొట్టును వొడిసి పట్టుకుని మంచినీటిని సంరక్షించుకోవాలని, ఎక్కడికక్కడ చెరువులను పటిష్టం చేసుకోవాలని, కోనేర్లు నిర్మించుకోవాలని, చెక్‌డ్యామ్‌లు కట్టుకుని వరదజలాలు సముద్రం పాలుకాకుండా చూసుకోవాలనే ప్రతిపాదనలు బోలెడున్నా.. అటకల మీదినుంచి అవి కిందికి దిగడం లేదు. ఇప్పటికైనా మేలుకోవాలి. ప్రజల దాహార్తిని తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిధులు విడుదల చేయాలి. దేశవ్యాప్తంగా గ్రామాల్లో ఉండే రక్షిత మంచినీటి పథకాలు ఏ దుస్థితిలో ఉన్నాయో పరిశీలించి, అవసరమైనచోట్ల మరమ్మతులు చేయించాలి. కుళాయిల్లో మంచినీరు కొరత లేకుండా సరఫరాను పెంచాలి. జలం బాగుంటేనే జనం బాగుంటారు. జనం బాగుంటేనే దేశం బాగుంటుంది. ఎక్కడ పరిశుభ్రమైన మంచినీరు పుష్కలంగా లభిస్తాయో ఆ ప్రాంతాలు ఆరోగ్యకరంగా కూడా ఉంటాయి. ఏదేమైనా సరే.. రానున్న వేసవిలో ప్రజలకు నీటి బాధలు లేకుండా చర్యలు తీసుకోవడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం!...




# అస్తవ్యస్తమవుతున్న కుటుంబ వ్యవస్థ!



నేటి ఆధునిక కాలంలో అన్ని వ్యవస్థలూ మారిపోతున్నట్లే చివరికి కుటుంబ వ్యవస్థ కూడా అస్తవ్యస్తమై పోతోంది. బంధాలు అనుబంధాలు, అనురాగాలు, రక్తసంబంధాలు కూడా నానాటికీ కనుమరుగైపోతున్నాయి. తాజాగా నిపుణుల అధ్యయనాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దీంతో కుటుంబవ్యవస్థ క్రమేణా త్వరలోనే కూలిపోతుందనే ఆవేదన, ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. కుటుంబం పట్ల చాలామందికి గౌరవం ఉన్నా, అధికశాతం కుటుంబాల ధోరణి అందుకు భిన్నంగా మారిపోతుండడం ఆందోళన కలిగించే విషయమే. అయినా, కుటుంబమన్నాక ఎన్నో బంధాలు ముడిపడివుంటాయి. భార్యాభర్తల బంధాలు, అన్నదమ్ములు, అక్కాతమ్ముళ్ళు, అన్నాచెల్లెళ్ళు అనురాగ బంధాలు.. పేగుబంధాలు అన్నీ ఉంటేనే కుటుంబంలో సంతోషం. అయితే ఆ బంధాలన్నీ నాన్సెన్స్ అన్నట్లు చాలామంది వాటిని ట్రాష్‌లో పడేస్తున్నారు. నోటి దురుసు, ప్రతి చిన్నవిషయాన్ని పెద్ద రాద్ధాంతం చేయడం, పిల్లల ముందే గొడవలు పడడం ప్రతి కుటుంబంలో సర్వసాధారణం అన్నట్లు తయారవుతున్నారు. దీంతో కుటుంబాల్లో ఒకవిధమైన మూర్ఖత్వం, అరాచక సంస్కృతి పెరిగిపోతున్నాయి. చిన్నచిన్న విషయాలకే అలిగి అటకెక్కి కూర్చుంటున్నారు. కుటుంబాల్లో ఎవరన్నా బాగున్నారంటే.. వారు బాగున్నారని సంతోషపడాల్సింది పోయి..అసూయతో రగిలిపోతున్నారు. తమ్ముళ్లు బాగుంటే చూడలేని అన్నలూ ఉంటున్నారు. అక్కలు స్థితిమంతులైతే ఈర్ష్యపడే సోదరులూ ఉన్నారు. బిడ్డలు తమను బాగా ఆదరిస్తారని భావించే తల్లితండ్రుల కలలు కూడా చివరికి కల్లలుగా, డొల్లలుగా మారిపోతున్నాయి. ఆర్థిక స్థితిగతులు బాగా లేకపోవడం, అసమానతలు పెరిగిపోవడం కుటుంబాల మీద బాగా ప్రభావం చూపుతోంది. దీంతో, ఎవరి ధోరణి వారిదే తప్ప, ఎదుటివారిని గౌరవించే సంస్కృతి, సంస్కారం మాయమైపోతున్నాయి.

## కనీసం ఇంగితజ్ఞానం కూడా ఉండడం లేదు :

నేటి ఆధునిక కాలంలో ఎక్కువశాతం జనం ఉన్న సమయాన్నంతా రకరకాల కాలక్షేపాలతో వృధా చేసుకుంటున్నారు. కుటుంబ బాధ్యతలను పక్కనపెట్టేసి, ఎంతసేపటికీ టీవీ సీరియళ్ళు, స్మార్ట్ ఫోన్లు, నెట్‌లో వచ్చే కార్యక్రమాల్లో తలమునకలవుతున్నారే తప్ప, ఇంట్లో పిల్లలతో రోజూ కాసేపైనా వారితో ప్రేమగా మాట్లాడాలన్న ఇంగితజ్ఞానం కూడా కరువైపోతోంది. తల్లులు-తండ్రులు-బిడ్డలు-కుటుంబ సభ్యులెంతమంది ఉంటే, అందరికీ ఒక్కో ఫోన్. స్వార్థం, డబ్బుమీద వ్యామోహం ఎక్కువైపోతున్నాయే తప్ప, మానవీయతలు, మానవ సంబంధాలు మరిచిపోతున్నారు. పెద్దవాళ్ళన్న గౌరవం కూడా పిల్లలకు ఏకోశానా ఉండడం లేదు. నవమాసాలు మోసి..కని, పెంచి ఎంతో మంచి జీవితాలనిచ్చిన తల్లితండ్రులు చివరికి చచ్చిపోయినా సరే.. విదేశాల నుంచి రావడానికి తీరికలేని 'గొప్పింటి' బిడ్డలు బోలెడంత మంది ఉన్నారు. ఎవరైనా మరణించినా కనీసం వారిని పలకరించి ఓదార్చే మానవీయత కూడా లోపిస్తోంది. ఏదో నాలుగక్షరాల మెసేజ్ ఇచ్చేసి వెళ్ళు దులుపేసుకుంటున్నారు. అయినవాళ్లు పోయినా..పాడె మోసేవాళ్లు కూడా లేరు. చచ్చిపోయిన తర్వాత కాటి దాకా వెళ్లే బంధుమిత్రుల కోసం వెతుక్కోవాల్సి వస్తోంది. పిల్లలు పెద్దవాళ్ళయ్యాక తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తుండడంతో ఎంతోమంది తల్లిదండ్రులు వృద్ధాశ్రమాల్లో జీవిత చరమ దశను జీవచ్ఛవాలుగా గడిపేస్తున్నారు. ఇంతటి దౌర్భాగ్య పరిస్థితుల్లోకి సమాజం వెళ్లిపోతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే 'కుటుంబ వ్యవస్థ' భవిష్యత్తు ఇక అంధకారమవుతుందనడంలో ఎలాంటి అనుమానం లేదు.

## ఇకనైనా మారాలి.. బంధాలను బలపరుచుకోవాలి :

ఇకనైనా మారాలి. కుటుంబాలకు మూలస్తంభమైన కుటుంబ వ్యవస్థ కూలిపోకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా దానిని కాపాడుకోవాలి. తల్లితండ్రులంటే బిడ్డలకు ప్రాణమిచ్చేవాళ్ళు, భార్యాభర్తలంటే అనురాగపు గూళ్ళు, అన్నదమ్ములంటే.. ప్రేమలకు ఆనవాళ్ళు, అక్కాతమ్ముళ్ళు, అన్నాచెల్లెళ్ళు పుట్టుకతో వచ్చే పేగుబంధాలు. అవన్నీ రక్తసంబంధాలు. ఒకనాటితో పోయేవి కాదు. ఇవన్నీ ఏనాటికీ తెగిపోకూడదు..ఎవరూ తెంచకూడదు కూడా. కలిసుంటే ఉండే ఆనందం విడిపోవడంలో ఉండదని తెలుసుకోవాలి. ఎవరి కుటుంబాల్లో వారు.. అందరూ ఒకరితొకరు అభిమానంగా, ఆత్మీయంగా జీవించాలే తప్ప, ప్రతి చిన్న విషయాన్ని రాద్ధాంతం చేసుకోవడం వల్ల చివరికి ఒరిగేదేమీ ఉండదని గుర్తుంచుకోవాలి. జీవితం..గాలి బుడగ లాంటిది. ఎప్పుడు ఢాం అంటుందో చెప్పలేం. ఆపాటిదానికి లేనిపోని చికాకులతో మనసులను బాధపెట్టుకుని, కుటుంబాల్లో..సంసారాల్లో కలతలు పెంచుకుని వేదనపడే కంటే.. ఉన్న నాలుగునాళ్ళూ అందరూ సంతోషంగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే మన బంధాలు-అనుబంధాలు చిరకాలం నిలుస్తాయి. తద్వారా..మన కుటుంబవ్యవస్థ కూడా కలకాలం నిలుస్తుంది!...

- రాజశ్రీ

# వీపీఆర్ లాంటివారు వైసీపీకి దూరమైతే.. నష్టమే!

గత వారం మన 'లాయర్'లో 'వైసీపీకి వీపీఆర్ దూరం' అన్న వార్త చదివి ఆశ్చర్యమేసింది. కష్టకాలంలో మూలస్థంభాలలా వైసీపీకి అండగా నిలచిన ప్రధాన వ్యక్తులలో ప్రస్తుత రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కూడా ఒకరు. 'లాయర్' రాసిందే జరిగితే వేమిరెడ్డి లాంటి వ్యక్తిని దూరం చేసుకోవడం పార్టీకి చాలానష్టం. అదే జరిగితే.. ఇప్పటివరకు జరిగిన అనేక ఎన్నికలలో నెల్లూరుజిల్లాలో తిరుగులేని పార్టీగా అవతరించిన వైఎస్ఆర్‌సీపీకి తిరోగమనం మొదలైనట్లే. నిజానికి ఆ పార్టీకి ప్రభాకరరెడ్డి చేసిన దానికంటే పార్టీ ఆయనకి చేసింది చాలా తక్కువ. రాజకీయంగా చూస్తే పార్టీ వలన వేమిరెడ్డికి ఒరిగేదేంలేకపోయినా ఆయన లాంటి వ్యక్తి వైసీపీలో ఉంటేనే పార్టీకి మంచిది.

కే.నరసింహారెడ్డి, ఆత్మకూరు.

# జగన్ తీరు తెలుగుజాతికే అవమానం!

మొత్తం తెలుగు సమాజం గర్వించదగిన మహావ్యక్తి భారతదేశ మాజీ ప్రధాని కీర్తిశేషులు పీ.వీ.నరసింహారావు. అంతటి గొప్ప సంస్కరణకర్తకి 'భారతరత్న' ప్రకటించడం భారతీయ జనతాపార్టీ నిష్పక్షపాత దృక్పథానికి, ఆ పార్టీ పెద్దల చిత్తశుద్ధికి నిదర్శనం. బహుముఖ ప్రజ్ఞాశాలి, విశేష ప్రతిభాపాటవాలు కలిగిన గొప్ప సేవాబుషి పీ.వీ. నరసింహారావు. ఆ మహానుభావుడి గురించి ఎంత చెప్పినా తక్కువే. అలాంటి వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం పట్ల ప్రతిస్పందించమని ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఢిల్లీ మీడియా అడిగితే 'సాయిరెడ్డి విల్ స్పీక్' అని ఆయన చెప్పడం, 'హి ఈజ్ నాట్ ది సీఎం ఆఫ్ ఏపీ' అని ఓ మీడియా మహిళ ఘాటుగా స్పందించడం తెలుగుజాతికే అవమానం. మన తెలుగువాడికి దక్కిన అరుదైన అద్భుత గౌరవం పట్ల కూడా, ఆంధ్రా ముఖ్యమంత్రి ఆనందాన్ని వ్యక్తంచేసి స్పందించలేకపోవడం విచారకరం, హాస్యాస్పదం!

లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# ప్రమాదకరంగా గొలగమూడి కూడలి!

నెల్లూరు నుండి గొలగమూడి వెళ్ళే మార్గంలో ఉన్న జాతీయ రహదారి కూడలి అత్యంత ప్రమాదకరంగా ఉంది. నగరం ఇప్పుడు గొలగమూడి వరకూ విస్తరిస్తోంది. అటువైపు వాహన రాకపోకలు ఎక్కువయినాయి. ఈ తరుణంలో జాతీయ రహదారిపై వచ్చే వాహనాలకి వేగ నియంత్రణ లేకపోవడంతో ఆ కూడలి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. పోలీసు శాఖ వారు శ్రద్ధ చూపించి జాతీయ రహదారిపై వచ్చే వాహనాల వేగం తగ్గించేలా బోర్డులను ఏర్పాటు చేస్తే మంచిది. లేదంటే ఘోర ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి!

వి.నాగేశ్వరరావు, సుందరయ్య కాలనీ.

# జొన్నవాడ దేవస్థానానికి నూతన కమిటీ

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయానికి నూతన కమిటీ ఎంపికైంది. ఛైర్మన్‌గా ఇందుకూరుపేట మండలం రాముడుపాలెంకు చెందిన మావులూరు శ్రీనివాసులురెడ్డి ఎంపిక కాగా, గాజుల సుజన, బట్టేపాటి విజయమ్మ, ఆములూరు విమల, ఇనమూరు త్రిశూల లక్ష్మి, ముంగర శివకుమార్, గుమ్మా రఘురామయ్య, కోటంరెడ్డి రాఘవరెడ్డి, సూరాయపాళెం రామకృష్ణ సభ్యులుగా ఎంపికయ్యారు. ఎక్స్‌అఫిషియో సభ్యునిగా వెంకట కామేశ్వరప్రసాద్ నియమితులయ్యారు. వీరంతా ఈ నెల 17వ తేదీన జొన్నవాడ దేవాలయంలో అధికారికంగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సమాచారం.

# 18న.. నానీలు, నవలా పురస్కారాలు



స్వర్గీయ జమున స్మారక జాతీయస్థాయి నానీల పురస్కార కార్యక్రమం, డాక్టర్ పెళ్లకూరు జయప్రద నవలా పురస్కార సభ ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు నెల్లూరులోని కెవిఆర్ పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఆ మేరకు ఆహ్వానపత్రికలను డాక్టర్ పెళ్లకూరు జయప్రద, పెరసం (పెన్నా రచయితల సంఘం) అధ్యక్షులు అవ్వారు శ్రీధరబాబు తదితరులు ఇటీవల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 'నానీల తీరాన' నానీల సంపుటి రచించిన ఎన్.లహరి (హైదరాబాద్)కి, 'వొలికల బీడు' నవలా రచయిత రాసానికి ఆ విశిష్ట పురస్కారాలను బహుకరిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నవలా రచయిత పెళ్లకూరు జయప్రద రచించిన 'విభిన్న శ్వాసలు' కథాసంపుటి ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ సభాధ్యక్షులుగా వ్యవహరిస్తారని, ప్రముఖ కవయిత్రి మహెజబీన్ పుస్తకావిష్కరణ చేస్తారని, ముఖ్యఅతిథిగా ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ డా. మాడభూషి సంపత్‌కుమార్, అరసం గౌరవాధ్యక్షులు పెరుగు రామకృష్ణ, పెరసం వ్యవస్థాపక అధ్యక్షులు మోపూరు పెంచలనరసింహం, నెరసం (నెల్లూరుజిల్లా రచయితల సంఘం) అధ్యక్షులు అనుమల జయప్రకాష్ పాల్గొంటారని, పెరసం కార్య నిర్వాహక కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి సభను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కవిసమ్మేళనాన్ని పెరసం ప్రధాన కార్యదర్శి తోట సులోచన నిర్వహిస్తారని, పాల్గొనే కవులకు జ్ఞాపికలు బహుకరిస్తామని పేర్కొన్నారు.

# రంగనాథుని గుడిలో సప్తవాహన సేవలు

రథసప్తమిని పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీన నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారికి సప్తవాహన సేవలు నిర్వహిస్తామని ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇ.ఓ డి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# అపోలో ఆసుపత్రికి అవార్డు

నెల్లూరులోని అపోలో ఆసుపత్రికి 'బెస్ట్ మల్టీ స్పెషాలిటీ' అవార్డు లభించడంతో జాతీయస్థాయి గుర్తింపు లభించిందని ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ నెల 13న ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ విషయం చెప్పారు. న్యూ ఇండియా అష్యురెన్స్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ ఈనెల 2న ముంబైలో తమ ఆసుపత్రికి ఆ అవార్డును బహుకరించిందని తెలిపారు. త్వరలోనే తమ ఆసుపత్రిలో క్యాన్సర్ విభాగాన్ని కూడా ప్రారంభించి అధునాతన వసతులతో ఆ వార్డును తీర్చిదిద్దనున్నామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## తెల్లరాయిని
# తవ్వేస్తున్నారు

ఎంతో విలువైన తెల్లరాయి గనులను అక్రమార్కులు తవ్వేసి తరలించుకుపోతున్నారు. ఆ అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు చేశారు. పొదలకూరు మండలంలోని మొగళ్ళూరులో తెల్లరాయిని కొందరు ప్రైవేటు వ్యక్తులు యంత్రాలతో తవ్వి తీసుకుపోతున్నారంటూ ఇటీవల ఆ గ్రామస్తులు జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌కు ఫిర్యాదు చేయడంతో అటవీ రేంజ్ అధికారి రవీంద్రబాబు తదితర అధికారులు స్పందించారు. దాచూరు డిఆర్‌ఓ ఖాజా రసూల్, స్క్వాడ్ డిఆర్‌ఓలు శ్రీనివాసులు, వరప్రసాద్ తదితరులు హుటాహుటిన వచ్చి తెల్లరాయిని తవ్విన ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశీలనలు పూర్తయ్యాక ఆ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విగ్రహాన్ని వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజ్ ప్రాంగణంలో ప్రతిష్టించనున్న సందర్భంగా అక్కడ జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలిస్తున్న ఆయన కుమారుడు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఛైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి.

# పోర్టులో ఉచిత వైద్యశిబిరం

ముత్తుకూరు మండలంలోని అదాని కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో ఈనెల 13న మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గోపాలపురంలోని సివిఆర్ కాంప్లెక్స్ హాస్పిటల్, నారాయణ ఆసుపత్రి వైద్యుల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో పోర్టు ఉద్యోగులు, కార్మికులతో కలిసి సుమారు 265 మందికి వైద్యులు వైద్యపరీక్షలు చేశారు. పోర్టు సీఈఓ రాజన్‌బాబు, పోర్టు అడ్మిన్ హెడ్ గణేశ్వర్మ, ఇహెచ్ఎస్ హెడ్ వేణుగోపాల్ రెడ్డి, రమేష్‌బాబు, రాజేష్ రంజన్, మనోహర్‌బాబు తదితరులు పర్యవేక్షించారు.

# కాంట్రాక్ట్ టీచర్ల కోసం.. 23, 24 తేదీల్లో ఇంటర్వ్యూలు

నెల్లూరు రూరల్ మండలంలోని కొత్తూరులో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్ట్ టీచర్ల నియామకానికి ఈనెల 23, 24 తేదీల్లో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ శంకరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. హిందీ, ఇంగ్లీష్, మ్యాథ్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు పీజీ చదివిన అభ్యర్థులను నియమిస్తామన్నారు. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు సంబంధించి ఇంగ్లీష్, మ్యాథ్స్, సోషల్, సైన్స్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలుంటాయని పేర్కొన్నారు.

అదే విధంగా, ప్రైమరీ టీచర్లు, స్పోర్ట్స్, మ్యూజిక్ కోచ్‌లు, స్పెషల్ ఎడ్యుకేటర్, ఎడ్యుకేషన్ కౌన్సిలర్, తెలుగు, యోగా టీచర్ల నియామకానికి ఈనెల 24న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఆసక్తికల అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రీయ విద్యాలయానికి వచ్చి, తమ పేర్లను నమోదు చేసుకోవాలని, విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో తీసుకురావాలని తెలిపారు. వివరాలకు కేంద్రీయ విద్యాలయం వారిని సంప్రదించాలని ఆయన సూచించారు.

## అయోధ్య రామాలయం స్ఫూర్తితో...
# బుచ్చి కోదండరామయ్యకు.. కొత్త వెలుగులు
## మార్చి 23 నుంచి 27 వరకు వైభవోపేతంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు



**అయోధ్య రామాలయం స్ఫూర్తితో.. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంలో వెలసివున్న శ్రీ కోదండరామాలయం కొత్త వెలుగులు సంతరించుకుంటోంది. త్వరలోనే జీర్ణోద్ధరణ పూర్తిచేసుకుని మహాకుంభాభిషేక మహోత్సవాలకు సిద్ధమవుతోంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి సారథ్యంలో, బుచ్చి సంస్థానంగా ప్రఖ్యాతిగాంచిన దొడ్ల వంశస్తులు, బెజవాడ - పొన్నలూరు కుటుంబాల వారి సహకారంతో, రామ భక్తులు.. వదాన్యుల దాతృత్వంతో ఆలయం అన్ని సొబగులతో శోభాయమానంగా రూపుదిద్దుకుంటోంది.**

బుచ్చి కోదండరాముడంటే..కోరిన వరాలిచ్చే కొండంత దేవుడుగా ప్రసిద్ధి. సుమారు 240 ఏళ్ల క్రితం నాటి ఈ ఆలయం 'దక్షిణ అయోధ్య'గా ప్రఖ్యాతి చెంది, జిల్లాలోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచిన విషయం అందరికీ తెలిసిందే. అందులోనూ ఎంతో మహిమాన్వితమైన ఆలయం ఇది. నాటి కాలంలో రామభక్తుడైన దొడ్ల రామిరెడ్డి ఈ ఆలయాన్ని 1784వ సంవత్సరం ప్రాంతంలో అత్యద్భుతంగా నిర్మాణం గావించారు. దాదాపు 20 ఏళ్లపాటు అహరహం శ్రమించి ఆయన ఈ దివ్యమైన రామాలయాన్ని నిర్మించడమే కాక, ఆ కాలంలోనే నూరడుగుల రాజగోపురాన్ని అత్యద్భుతంగా నిర్మించి కోదండరాముని కోవెలను సర్వాంగసుందరం చేశారు. రాష్ట్రంలోని రామాలయాల్లోనే ఇది రెండవ అతిపెద్ద రాజగోపురమని ప్రతీతి. ఆలయ ప్రాంగణంలో 50 అడుగుల ధ్వజస్తంభం, ఇంకా ప్రాకార మండపం, ముఖమండపాలు, అత్యద్భుతమైన శిల్పాలతో అడుగడుగునా దొడ్ల వంశీయుల రామభక్తి తొణికిసలాడే విధంగా ఆలయాన్ని రూపొందించారు. కోదండ రామునికి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అప్పట్లోనే 40 అడుగుల రథాన్ని కూడా నిర్మించారు. స్వామివారి తెప్పోత్సవం కోసం రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో అద్వితీయంగా కోనేరు కట్టించారు. ఆలయ ప్రాంగణంలో కొలువైవున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, క్షేత్రపాలకుడైన శ్రీ లక్ష్మీనృసింహుడు, శ్రీ వరదరాజస్వామి, శ్రీ మహాలక్ష్మీదేవి అమ్మవారి సన్నిధి, గోదాదేవి, ఆండాళ్ అమ్మవారి మందిరం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ప్రతిఏటా ఏప్రిల్‌లో తొమ్మిది రోజుల పాటు శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ఇక్కడ అంగరంగవైభవంగా జరుగుతుంటాయి. వేలాదిమంది భక్తులు తరలి వచ్చి కోదండరాముని దర్శించుకుని తరిస్తుంటారు. రామభక్తులైన దొడ్ల వంశీయుల ఆధ్వర్యంలో ఈ ఆలయం నాటినుంచి దినదినప్రవర్ధమానమవుతూ ఉంది. దొడ్ల వంశీయులు, బెజవాడ, పొన్నలూరు కుటుంబాల వారంతా కలిసి ఈ ఆలయాన్ని భక్తులందరికీ నయనానందకరంగా ఉండేలా తీర్చిదిద్దారు.

## 23 నుంచి దేదీప్యమానంగా పూజలు :

ప్రస్తుతం ఈ ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి నేతృత్వంలో, వదాన్యుల సహకారంతో సుమారు 240 ఏళ్ల నాటి ఈ ఆలయానికి జీర్ణోద్ధరణ గావించి, ఆలయాన్ని మరింతగా దేదీప్యమానం చేస్తున్నారు. రాజగోపురాన్ని, విమాన గోపురాన్ని, ఆలయ పైకప్పు వగైరాలను మరమ్మతులు చేసి అందంగా రూపొందిస్తున్నారు. దాదాపు కోటీ 60 లక్షలకు పైగానే ఈ జీర్ణోద్ధరణ తదితర కార్యక్రమాలకు వెచ్చించాల్సి ఉంటుందని ఒక అంచనా. ఈ నేపథ్యంలో కోదండరామస్వామి ఆలయానికి విరాళాలు అందజేసి ఆలయాభివృద్ధికి సహకరించదలచిన వదాన్యులు తమను సంప్రదించవచ్చని ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా వచ్చే మార్చి 23వ తేది నుంచి 27వ తేది వరకు ఆలయంలో పెద్దఎత్తున మహాకుంభాభిషేక మహోత్సవాలను కూడా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆగమ పండితులు శ్రీ పరాంకుశం సీతారామాచార్యుల వారి ఆధ్వర్యంలో ఈ మహోత్సవాలు కన్నులపండువగా జరుగనున్నాయి కూడా. ఆలయ అభివృద్ధికి సహకరించదలచిన భక్తులు, దాతలు వ్యవస్థాపక ధర్మకర్త, ఎగ్జిక్యూటివ్ అథారిటీ సెల్‌ఫోన్ : 94411 83561 నంబరుకు సంప్రదించవచ్చని వారు కోరుతున్నారు.



# ఆరోగ్యం పట్ల అలక్ష్యం వద్దు

## ఉప రవాణా కమిషనర్ చందర్

రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఇటీవల నెల్లూరులోని ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఉపరవాణా కమిషనర్ చందర్, ఎనెల్ హాస్పిటల్ ఛైర్మెన్ నాగేంద్ర ప్రసాద్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రభుత్వాసుపత్రిలోని కంటి విభాగానికి సంబంధించిన వైద్య బృందం, ఎనెల్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కంటి వైద్యులు డాక్టర్ అరుణ, వేదాయపాళెం ప్రైమరీ సెంటర్ డాక్టర్ సుమయ, ఎనెల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ దావూద్ పాల్గొని దాదాపుగా 250మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, ఈసీజీ పరీక్షలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి నుండి ప్రత్యేకంగా పంపిన మందులను కూడా వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. చందర్‌తో పాటు మోటార్ వాహన తనిఖీ అధికారులు, ఆఫీసు సిబ్బంది, లారీ డ్రైవర్లు, ఆటోడ్రైవర్లు, డ్రైవింగ్ టెస్టుకు వచ్చిన అభ్యర్థులందరూ వైద్య పరీక్షలు చేయించుకోవడం విశేషం.

# 'విశ్వసాయి' హవా





జెయియి మెయిన్స్‌లో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమప్రతిభతో రాణించారు. ఈ కళాశాలకు చెందిన ఎం.దివ్యశ్రీ 97.82 పర్సంటైల్‌ను, సిహెచ్ యశ్వంత్ 97.52 పర్సంటైల్‌ను సాధించారని ఆ కళాశాల ఛైర్మెన్ డా.ఎన్. సత్యనారాయణ, వైస్ ఛైర్మెన్ కృష్ణమోహన్ తెలిపారు. వారితో పాటు మరో 14 మంది విద్యార్థులు 90కి పైగానే పర్సంటైల్ సాధించారని, మరో 47 మంది 80కి పైగా పర్సంటైల్‌తో రాణించారని వారు పేర్కొంటూ, ఉత్తమ ఫలితాలు సాధించిన ఆ విద్యార్థులను అభినందించారు.

# నెల్లూరు కబుర్లు

## వైసీపీతోనే నా ప్రయాణం..

# పార్టీ మారే ఆలోచనే లేదు

### - స్పష్టం చేసిన ఎంపీ ఆదాల



'పదే పదే చెబుతున్నా..సీఎం జగన్ నిర్ణయం మేరకు నేను వైఎస్ఆర్‌పీ అభ్యర్థిగానే పోటీచేస్తా. పార్టీ మారే ఆలోచనే లేదు. పార్టీ నిర్ణయమే నాకు శిరోధార్యం'... అని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గం వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. వివిధ ప్రచార, ప్రసార మాధ్యమాలలో తాను పార్టీ మారుతున్నట్లు అసత్య ట్రోలింగ్స్ ఇస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఆ విషయాలపై బుధవారం నెల్లూరులోని తన కార్యాలయంలో మీడియాతో ఆదాల మాట్లాడుతూ, తాను ఎట్టి పరిస్థితుల్లోనూ వైఎస్సార్సీపీని వీడేది లేదన్నారు. తన ప్రయాణం వైసీపీతోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు. నెల్లూరు రూరల్ నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులతో వైఎస్సార్సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. తాను నెల్లూరు రూరల్ ఇన్చార్జ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి కొంతమంది తనపై అసత్య ప్రచారాలను ట్రోల్ చేయడం మొదలుపెట్టారని, తాను ఇప్పటికే అనేకసార్లు ఆ అసత్య ప్రచారాలను ఖండించానని గుర్తుచేశారు. తాను ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాగుంట శ్రీనివాసరెడ్డిలను కలిసిన మాట వాస్తవమేనని, వారిని పార్టీ వీడవద్దని చెప్పిన మాట కూడా వాస్తవమేనని, అయితే నిర్ణయం వారికే వదిలిపెట్టామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

# సైబర్ మోసాలపై.. యువత అప్రమత్తంగా ఉండాలి

సైబర్ మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు సైబర్ క్రైమ్ వింగ్ ఎస్ఐ సురేష్‌బాబు చెరప్పారు. యువజన సంక్షేమశాఖ (సెట్నెల్) ఆధ్వర్యంలో ఈనెల 13న స్థానిక రావూస్ డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సాంకేతికత బాగా అభివృద్ధి చెందుతున్న నేటి రోజుల్లో సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయని, సామాజిక మాధ్యమాలను ఉపయోగించడంలోని సమస్యలను యువత అవగాహన చేసుకోవాలని సూచించారు. సెట్నెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగరాజకుమారి, రావూస్ ప్రిన్సిపాల్ షేక్ షరీఫ్, యువజన సంక్షేమశాఖ మేనేజర్ బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ గయాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ బడ్జెట్.. రూ. 374 కోట్లు

## ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



2024-25 సంవత్సరాలకు సంబంధించి 374 కోట్ల రూపాయలతో నెల్లూరుజిల్లా పరిషత్ అంచనాల బడ్జెట్‌ను ఆమోదించినట్లు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చెప్పారు. ఈనెల 13న స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 2024- 2025 సంవత్సరాల బడ్జెట్‌కు సంబంధించి జిల్లా పరిషత్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ ప్రవేశపెట్టిన అంచనాల బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ, రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో నీటిఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. 2024-25 సంవత్సరానికి బడ్జెట్ రూ.374.43 కోట్లు కాగా, వ్యయం రూ. 297.41 కోట్లకు ఆమోదించామన్నారు. ఆమోదించిన బడ్జెట్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి దృష్టికి తీసుకువెళ్ళి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత విడవలూరు ఎంపీపీ వేణుంబాక భవానమ్మ మృతికి సమావేశం సంతాపం తెలిపింది. జడ్పీ సీఇఓ కన్నమనాయుడు, డెప్యూటీ సీఇఓ చిరంజీవి, పలు శాఖల అధికారులు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# వేడుకగా..సరస్వతీదేవి పూజ



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో మాఘ పంచమి సందర్భంగా ఈనెల 14న సరస్వతీదేవికి పూజలు, చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి, తమ పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పిల్లలకు పలకలు, పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

# 'తంగిరాల మహాభారతం' 91వ భాగం

ఇంద్రుని ఆజ్ఞ మేరకు ఊర్వశి చక్కగా అలంకరించుకొని మదన వేదనతో అర్జునుని దగ్గరకు వచ్చినప్పుడు అర్జునుడు ఆమెను గౌరవించి తల్లి అని సంబోధిస్తాడు. నిర్ఘాంతపోయిన ఊర్వశి తమకు వావి వరసలు ఉండవని, తనని స్వీకరించమని కోరినప్పుడు.. నీవు తల్లి లాంటి దానివి అని తిరస్కరిస్తాడు. దాంతో ఊర్వశికి కోపం వచ్చి నపుంసకుడివై వికృత రూపంతో స్త్రీల మధ్య తిరుగుతూ వారికి సంగీతం, నాట్యం నేర్పే నాట్యాచార్యుడిగా మారిపోతావు అని శపిస్తుంది. అది తెలిసి ఇంద్రుడు




అర్జునునికి ఆ శాపం ముందు ముందు అరణ్యవాసంలో ఉపయోగపడుతుందని అర్జునునికి ఎన్నో దివ్యాస్త్రాలు ప్రసాదిస్తాడు. హస్తినాపురంలో శ్రీకృష్ణ ద్వైపాయనమునీశ్వరుని ద్వారా అర్జునుడు సాధించిన దివ్యాస్త్రాల గురించి తెలుసుకొని ధృతరాష్ట్రుడు తన కుమారులకు రాబోయే దుస్థితి తెలుసుకుని ఎంతో దుఃఖపడతాడు. అరణ్యవాసంలో మిగతా పాండవులు, ద్రౌపది అర్జునుని రాకకోసం ఎదురుచూస్తూ ఉంటారు. ఇంద్రుడు రోమశ మహర్షిని ధర్మరాజు దగ్గరకు పంపి, వారికి రక్షగా ఉండమని కోరతాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




# 'కృష్ణచైతన్య' విజయభేరి



జాతీయస్థాయి జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాల ఐనిస్టిన్ క్యాంపస్ విద్యార్థులు విజయభేరీ మోగించారు. ఈ కళాశాలకు చెందిన జె.హర్షవర్ధన్ 99.82 పర్సంటైల్‌తో ముందుండగా, జి.ప్రతాప్‌నాయుడు 99.42, కె.సూర్యప్రకాష్ 97.41, కె. విక్రమ్ 97.27, ఏ.దివ్యశ్రీ 97.18, కె.జ్యోతిర్మయి 97.06 పర్సంటైల్ సాధించడంతో పాటు 95 పర్సంటైల్‌కు పైగా 11మంది విద్యార్థులు, 90 పర్సంటైల్‌కుపైగా 21మంది విద్యార్థులు ఉత్తమశ్రేణిలో రాణించడం తమకెంతో ఆనందంగా ఉందంటూ కళాశాల ఛైర్మెన్ ఆర్‌వి కృష్ణారెడ్డి, డైరెక్టర్ రానా ప్రమోద్‌రెడ్డిలు పేర్కొంటూ, వారు ఆ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ శిరీష్‌బాబు, అకడమిక్ డీన్ రామ్‌గోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్పాస్టిక్ సెంటర్‌లో ప్రమోద్ పుట్టినరోజు



రెడ్‌క్రాస్ నెల్లూరుజిల్లా శాఖ ఛైర్మెన్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు రానా ప్రమోద్‌రెడ్డి తన 27వ పుట్టినరోజు వేడుకలను ఈ నెల 14న నెల్లూరులోని స్పాస్టిక్ సెంటర్‌లో పిల్లల మధ్య వేడుకగా జరుపుకున్నారు. అనంతరం చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి సతీమణి ప్రవీణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు దాసరి రాజేంద్రప్రసాద్, పి.మస్తానయ్య, స్పాస్టిక్ సెంటర్ కో-కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ప్రిన్సిపాల్ పి.గురునాధరావు, సిబ్బంది పాల్గొన్నారు.



# విజయమే లక్ష్యంగా పనిచేయాలన్న సీఎం

## ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

రానున్న ఎన్నికల్లో జిల్లాలో వైకాపా విజయం కోసం ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 12న తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో తాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిశానని, ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు విషయాలను సీఎం తనతో చర్చించారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అందించిన సేవలను ప్రజలకు అవగాహన కలిగేవిధంగా వివరించాలని సీఎం ఈ సందర్భంగా తనకు తెలిపారని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారని ఆయన వివరించారు.



# దేశ నేతలతో..మన నెల్లూరు నాయకులు

పార్లమెంట్ చివరి సమావేశాలు ముగిసిన అనంతరం దేశ రాజధాని న్యూఢిల్లీలో రాష్ట్ర వైకాపా పార్లమెంట్‌సభ్యులతో కలసి ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజనాథ్‌సింగ్‌లతో సమావేశమైన నెల్లూరు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు, మన నెల్లూరీయులు.. ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి తదితరులు.



# టీడీపీలోకి చేరికలు

## పార్టీ కండువాలు కప్పి స్వాగతించిన సోమిరెడ్డి

వెంకటాచలం మండలం చెముదుగుంట దళితవాడ నుండి 16 కుటుంబాలు ఇటీవల వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలో చేరాయి. నెల్లూరులో టీడీపీ నేత.. మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరడంతో, వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. మండల తెలుగు యువత కార్యదర్శి వినోద్ ఆధ్వర్యంలో సిద్ధికోటి శీనయ్య, యర్రమాల అశోక్, కోలా శ్రీను, ముత్యాల మనోహర్, గురజాల నిరంజన్, ఉక్కాల పెంచలయ్య, పసల సుకుమార్, కడివేటి నవీన్, నిప్పట్ల మల్లి, పాముల వెంకటేష్, తాటిపర్తి వెంకయ్య, ఉదయగిరి ప్రవీణ్ తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, మంత్రి కాకాణి చేసే అరాచకాలు సహించలేక యువత తెలుగుదేశం పార్టీలో చేరటం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్, మండల కోశాధికారి అశోక్‌తో పాటు పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేవారికే మద్దతు

## రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకుల స్పష్టీకరణ



బీసీలకు ఎమ్మెల్యేల స్థానాలు కేటాయింపులో ప్రాధాన్యత ఇచ్చేవారికే తమ మద్దతు ఉంటుందని పలువురు బీసీ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒట్టూరు సంపత్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈనెల 13న నెల్లూరులోని ఓ కల్యాణమండపంలో బీసీ నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) మాట్లాడుతూ, బీసీలకు అండదండగా ఉండేది వైసీపీయేనని, వైసీపీ పాలనలోనే బీసీలకు సముచిత స్థానం లభించిందని చెప్పారు. టీడీపీ నాయకులు చెంచలబాబుయాదవ్, కప్పిర శ్రీనివాసులు, బొమ్మి సురేంద్ర మాట్లాడుతూ, బీసీల అభివృద్ధి కోసం టీడీపీ చేసిన కృషిని వివరించారు. వైకాపా కంటే రెండుమూడు సీట్లు టీడీపీ అదనంగానే బీసీలకు కేటాయిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకుడు రామ రాజు, బీజేపీ నాయకులు నాగేంద్ర, సురేష్, పీఎల్ రావు, కాంగ్రెస్ నాయకుడు కనకట్ల రఘురాం ముదిరాజ్, బీసీ సంఘాల నాయకులు, పలు పార్టీలకు చెందిన కెవి శేషయ్య, దేవరాల సుబ్రహ్మణ్యం, జనార్ధన్, బొమ్మి నాగకిషోర్, జానకిరామ్‌యాదవ్, దినేష్, సురేష్, బాలాజీ, బెల్లంకొండ చిన్నయ్య, శ్రీనివాసులు, కిన్నెర మాలకొండయ్య, శ్రీకుమార్ తదితరులు పాల్గొని ఏ పార్టీ అయినా సరే బీసీలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# మంచి జరిగితేనే ఓటేయండి

## - నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో, వైకాపా ప్రభుత్వంలో మీకు మంచి జరిగితేనే ఓటేయండి, మంచి చేసినవారిని మరచిపోకుండా గెలిపించండి' అని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 12న వెంకటగిరిలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దమ్ము-ధైర్యం కలిగిన నాయకుడు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని ఆయన అంటూ, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డే అభ్యర్థిగా భావించాలని, తాము ఆయన ప్రతినిధులం మాత్రమేనని వివరించారు. వెంకటగిరి ప్రాంత రైతాంగాన్ని ప్రజలను ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. వెంకటగిరి ఎమ్మెల్యేగా నాలుగేళ్లుగా అభివృద్ధి పనులు చేపట్టకపోగా, జరుగుతున్న పనులను ఆపి... అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వానికి లేఖలు రాస్తే, నిధులు ఇవ్వనందువలనే తాను పార్టీ మారానని ఎమ్మెల్యే ఆనం కాకమ్మ కబుర్లతో కాలం గడిపేశారని ఆయన విమర్శించారు. వెంకటగిరి-బాలాయపల్లి రోడ్డు ఎమ్మెల్యే ఆనం ప్రోద్బలంతోనే కాంట్రాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పనులు నిలుపుదల చేశారని, ఇక్కడ పనులు ఆపిన తర్వాతే పొదలకూరులో పనులు చేయడం నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఆనం చెబుతున్నట్టు బిల్లులు కానందునే బాలాయపల్లి రోడ్డు పనులు ఆపితే పొదలకూరులో చేసిన పనులకు ఎలా బిల్లులయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఈ నియోజకవర్గంలో కాంట్రాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి అన్ని పనులు ఎలా వచ్చాయో తెలపాలన్నారు. గతంలో ఎమ్మెల్యే ఆనం ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాల్లో తన పేరు లేకుండా చేశారని, తాను మాత్రం నేడు నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాల్లో ఎమ్మెల్యే ఆనం పేరును విధిగా వేయిస్తూ ప్రోటోకాల్ సంప్రదాయాలను పాటిస్తున్నానని వివరించారు. 30 ఏళ్లకు పైగా వెంకటగిరిలో స్థిరనివాసం ఏర్పరుచుకోవడమే కాకుండా ఓటును సైతం వెంకటగిరిలోనే కలిగి ఉండి, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఇక్కడి ప్రజలతో నేదురుమల్లి కుటుంబం మమేకమై ఉందని ఆయన ఈ సందర్భంగా వివరించారు

# మానవత్వం చాటుకున్న రామ్

## - ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలింపు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ బాధితుడిని చూసి నేదురుమల్లి రామ్ వెంటనే మానవతా హృదయంతో స్పందించారు. ఆ బాధితుని వైద్యశాలకు తరలించేందుకు తక్షణ చర్యలు తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. వెంకటగిరి పట్టణం పాల కేంద్రం సమీపంలో మోటార్ సైకిల్ ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన సంఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఆ సమయంలో డక్కిలిలో వైఎస్ఆర్సీపి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి వెళ్తున్న రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆ ప్రమాదాన్ని చూసి చలించిపోయారు. వెంటనే కారు దిగి, ఆ బాధితుడిని వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు దగ్గరుండి ఏర్పాట్లు చేయించారు. బాధితుడు కోలుకునేందుకు మంచివైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.

# పొంగూరులో ఉచిత వైద్యశిబిరం

మర్రిపాడు మండలంలోని పొంగూరులో ఈనెల 11న లయన్స్‌క్లబ్ వారి సౌజన్యంతో ఆర్ఎంపి వైద్యులు ఎన్. రమేష్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించి, సుమారు రెండువందల మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులిచ్చారు. ఆత్మకూరుకు చెందిన ప్రముఖ వైద్యులు ప్రవీణ్‌కుమార్‌తోపాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.




### పుల్వామా అమరవీరులను స్మరించుకుంటూ..

# ఎన్‌బికెఆర్‌లో ఎన్‌సిసి ర్యాలీ




ఫిబ్రవరి 14, 2019న జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామా జాతీయ రహదారిలో వెళుతున్న భారత సైన్యంపై ఆత్మాహుతి దాడి జరిగిన ఘటనలో 40 మంది రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సైనికులు వీరమరణం పొందారు. ఆ రోజును 'బ్లాక్ డే'గా పాటిస్తూ, ఆ దుర్ఘటన జరిగి 5 సంవత్సరాలైన సందర్భంగా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సిసి, ఆర్మీ మరియు నేవీ క్యాడెట్లు ఆ వీరజవాన్ల త్యాగాలను గుర్తుచేసుకుంటూ, వారికి సంఘీభావంగా ఈనెల 14న ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, దేశం కోసం వీర మరణం పొందిన సైనికులు, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశ రక్షణలో సైనికులు చూపే నిబద్ధతను చూసి, నేటితరం విద్యార్థులు స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోఎన్‌సిసి ఆఫీసర్లు లెఫ్టినెంట్ మాధవయ్య, సబ్ లెఫ్టినెంట్ మల్లికార్జునరెడ్డి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.




# సిద్ధం... సంసిద్ధం!

గూడూరు నియోజకవర్గంలో ఎన్నికల వేడి మొదలైంది... అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ తరఫున గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్‌రావు నియోజకవర్గంలో పర్యటిస్తూ నాయకులను, కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ, జనసేన మద్దతుతో గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాశం సునీల్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. మరోపక్క సునీల్‌కుమార్ సతీమణి పాశం సంధ్యారాణి కూడా భర్త సునీల్ గెలుపు కోసం కార్యకర్తలతో కలిసి గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇదిలా ఉంటే... గూడూరు పట్టణంలో గత రెండు రోజులుగా 'సిద్ధం!... సంసిద్ధం' ప్లెక్సీల ఏర్పాటుతో... వైసీపీ, టీడీపీ శ్రేణుల్లో ఎన్నికల పోటీ ప్రారంభమైంది. అభ్యర్థులు ఇద్దరూ పోటాపోటీగా ఏర్పాటు చేసిన ప్లెక్సీలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.



# వైసీపీలోకి వంకి పెంచలయ్య

కందుకూరుకి చెందిన డాక్టర్ వంకి పెంచలయ్య వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఇటీవల సీఎం వైయస్ జగన్ సమక్షంలో పెంచలయ్య, ఆయన ఇద్దరు కుమార్తెలు అరవింద, డాక్టర్ ఐశ్వర్యలు వైకాపాలో చేరారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# గూడూరు తహశీల్దార్‌గా కరుణ్‌కుమార్



గూడూరు తహశీల్దారుగా కరుణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గూడూరు మండలంలోని విఆర్వోలు, మండల రెవెన్యూ కార్యాలయం సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

# మనోహరం.. చీమకుర్తి వారి 'సుందరకాండము'

రామాయణం ప్రాచీన భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే సర్వోత్తమ కావ్యం. దేశ కాలాలకు, కులమతాలకు అతీతంగా మానవులకు ఉత్తమ జీవన విధానాన్ని ప్రసాదించే ఆదర్శ గ్రంథం. అందుకే మనదేశంలోనే గాక విదేశాలలో కూడా అనాదిగా చదవబడుతున్నది, కీర్తించబడుతున్నది.

రాముని చరిత్రే రామాయణం. శ్రీరాముని చరిత్ర పవిత్రమైంది. మన పాపాలను నశింపజేస్తుంది. చదివినవారికి పుణ్యాన్ని కలిగిస్తుంది. ఇది వాల్మీకి మహాముని చేత రచించబడింది. 'రామాయణంలో ధర్మం, మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి, పతిభక్తి, సోదర ప్రేమ మొదలైన ధర్మాలన్నీ చెప్పబడి ఉన్నాయి' – అని జగద్గురు శంకరాచార్యులవారన్నారు.

'రాస్తే రామాయణమే రాయాలి' అని చాలా మంది తెలుగు కవులు భావించారు. ఆ విధంగా భావించిన శ్రీ చీమకుర్తి వేంకటేశ్వరరావు 'సుందర కాండము' అనే గ్రంథాన్ని వెలయించారు. ఈయన విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు. బహుగ్రంథకర్త. ఆధ్యాత్మిక రచనలు, ఉపన్యాసాలు జీవనమార్గంగా చేసుకుని ముందుకు సాగుతున్న తాత్త్వికులు.




**సుందరకాండము**
రచయిత:
డా॥ చీమకుర్తి వేంకటేశ్వరరావు
వెల: అమూల్యం
ప్రతులకు:డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు
ఎస్-10, పి.టి.జి రాజ్‌టవర్స్, రేబాలవారివీధి,
స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు - 2.
సెల్:9908855294

అయితే, రచయిత 'సుందర కాండ'నే ఎందుకు ఎన్నుకున్నారని ఆలోచిస్తే – 'హనుమంతుల వారి నిరంతర కృషిని, కార్యదీక్షను, స్వామిభక్తిని, సందర్భోచిత కర్తవ్యనిర్వహణా దక్షతను, ఆలోచనాశక్తిని తెలియజేసేదే సుందరకాండం'. దీన్ని ప్రతి దినం పఠిస్తే, సదా ఆయన్ను స్మరిస్తే మన బుద్ధి వికసిస్తుంది. మానసిక బలం చేకూరుతుంది. ధైర్యం అలవడుతుంది. భయం తొలగిపోతుంది. రోగాలు దరిచేరవు. చెడు భావనలు తొలగిపోతాయి. మన మాటకు మంచి ప్రభావం కలుగుతుంది. ఈ కోణాల వల్ల చీమకుర్తి వారు 'సుందర కాండాన్ని' మనోహరంగా చెప్పారు. ఆయన పద్యకావ్యాలను వెలువరించిన వారు గనుక, ఆ అనుభవంతో ఇందులో రామాయణ విశిష్టతను, సుందరకాండ ప్రత్యేకతను, శ్రీ సీతారాముల గుణశీలాలను, హనుమంతుని మూర్తిమత్వాన్ని విశ్లేషించగలిగారు.

రామాయణంలో ఏడు కాండాలున్నాయి. అందులో ముఖ్యంగా మూడు కాండాలు మూడు ముఖ్య నగరాలలో జరిగాయి. అయోధ్యలో జరిగింది అయోధ్య కాండం, కిష్కింధలో జరిగింది కిష్కింధ కాండం. అయితే లంకలో జరిగినదానికి లంకా కాండమని వాల్మీకి పేరు పెట్టలేదు. సుందరకాండం అని పెట్టారు. ఈ కాండంలో ప్రధాన పాత్రధారి హనుమంతుడు. ఆయనకు సుందరుడనే పేరుంది. అందువల్ల సుందరకాండం అని పేరుపెట్టడం జరిగిందని కొందరంటారు. ఈ కాండంలో పాత్రల భౌతిక సౌందర్యంతో పాటు, పాత్రల శీలసౌందర్యం చక్కగా విశదీకరించబడింది. ముఖ్యంగా సీతారాముల దాంపత్య ధర్మ సౌందర్యం చక్కగా తెలియజెప్పబడింది. కనుక 'సుందర కాండము' అని పేరు పెట్టబడిందని పలువురి అభిప్రాయం. చీమకుర్తి వారు ఈ కాండం విశిష్టతను తన సహజమైన తాత్త్విక ధోరణిలో ఇలా తెలియజేశారు. ఇది 'ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. సీత జీవాత్మ, శ్రీరాముడు పరమాత్మ. జీవాత్మ అయిన సీత, పరమాత్మకు దూరం అయింది. కారణం బంగారు జింక కావాలని ఆశించడమే. అంటే ఎవరైతే ఐహిక విషయాలపై కోరిక చూపుతారో వారు పరమాత్మకు దూరం అవుతారు. హనుమంతుడనే మనస్సు, సంసారమనే సముద్రాన్ని దాటి లంకయనే దేహాన్ని కాల్చి, సీతయనే ఆత్మతత్త్వాన్ని తెలిసికొని, పరమాత్మ అయిన శ్రీరామునకు ఆత్మను అప్పగిస్తుంది.' ఇది సాధకుడి విజయం.

చీమకుర్తి ఈ గ్రంథంలో వీలున్నప్పుడల్లా ఆధ్యాత్మిక బోధ గావించారు. అవి తప్పక పాఠకుల హృదయాలను ప్రక్షాళన చేసి, పారమార్థిక చింతనా వైశిష్ట్యాన్ని, వైదికసూక్తులు రామాయణంలో ఎలా ప్రతిఫలించాయి? అన్న విషయాన్ని, సుందరకాండలోని వివిధ పాత్రల స్వరూప స్వభావాలను సవిస్తరంగా చెప్పారు. మార్గదర్శకం చేశారు. చీమకుర్తి వారు హనుమంతుని గురించి చెప్తూ, స్వామివారి కార్యనిర్వహణలో అత్యంత శ్రద్ధ కనబరిచాడు. చూచి రమ్మంటే.. కాల్చి వచ్చాడు. నిరంతరం శ్రీరాముని నామస్మరణతో తన దేహాన్ని మరచిపోయేవాడు. ఆ విధంగా భక్తి యోగాన్ని సాధన చేసిన వాడయ్యాడు. కార్యసాధకుడూ అయ్యాడు. రచయిత విభీషణున్ని గుర్చి చెప్తూ, 'బ్రహ్మదేవుడు వరం కోరుకోమంటే, విభీషణుడు, 'దేవా! ఎటువంటి ఆపదలో ఉన్నా, నా బుద్ధి ధర్మం నందే స్థిరంగా వుండేటట్లు అనుగ్రహించు' అని కోరాడు. ఈ వాక్యంతో విభీషణుని ధర్మప్రియత్వం సువిదితం అవుతుంది. 'ధర్మో రక్షతి రక్షితః' కదా! ఈ విధంగా రామాయణంలో పాత్రల స్వరూప స్వభావాలను, సుందరకాండం ప్రత్యేకతలను, ధార్మిక, తాత్త్విక ఆలోచనలతో 'సుందర కాండాన్ని' నింపి అవశ్యపఠనీయ గ్రంథంగా తీర్చిదిద్దారు. మరెన్నో ఐతిహాసిక గ్రంథాలు ఆయన కలం నుండి తెలుగు పాఠక లోకానికి అందాలని ఆశిస్తున్నాను.



డా. గంగిశెట్టి శివకుమార్
నెల్లూరు. సెల్: 9441895343.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# సేవాతత్పరుడు రియాజ్ అహ్మద్



రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ షేక్ రియాజ్‌అహ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇటీవల గూడూరు పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజనీర్లు, లయన్స్ క్లబ్ సభ్యులు కేక్ కట్ చేసి రియాజ్ అహ్మద్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈఈ గిరినాథ్ మాట్లాడుతూ రియాజ్‌అహ్మద్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడే కాకుండా, గౌరవాధ్యక్షుడిగా కూడా మా అందరికీ సహాయసహకారాలు అందివ్వడమేకాక, చదువుకునే పేద విద్యార్థులకు సహాయం చేసే అవకాశాన్ని కల్పించారన్నారు. అనంతరం పేదలకు పలసరుకులు, ప్రభుత్వ ఆసుపత్రిలోని బాలింతలకు పాలు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. శ్రీనివాసులురెడ్డి, రవీంద్రకుమార్, కృష్ణబాబు, రామచంద్రయ్య, చైతన్యకుమార్, అసిస్టెంట్ ఇంజనీర్లు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# శిశుమందిరంలో అక్షరాభ్యాసాలు



వసంత పంచమిని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ గూడూరు తూర్పువీధిలోని శ్రీ సరస్వతి శిశు మందిరం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సామూహిక అక్షరాభ్యాస కార్య క్రమం జరిగింది. సరస్వతిదేవి పూజ, యాగాలు అనంతరం వేదపండితులచే అక్షరాభ్యాసం నిర్వహించారు. ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సభ్యులు డా. సి.రోహిణి, విష్ణువందన, స్నేహలతారెడ్డి, రాజ్యలక్ష్మి, ఆడిటర్ రామ్మోహన్‌రావు పలకలు, పూజా సామాగ్రి, ప్రసాదం వితరణ చేశారు. పాఠశాల కమిటీ సభ్యులు రమణయ్య, రవిచంద్ర, సనత్ కుమార్‌రెడ్డి, ప్రధాన ఆచార్యులు రంగనాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని పాత బస్టాండు ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు, మతతత్వ ధోరణులకు నిరసనగా ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్త సమ్మె తలపెట్టామన్నారు. సీపీఐ, సీపీఎం నాయకులు సీహెచ్. ప్రభాకర్, జీ.శశికుమార్, షేక్ కాలేషా, గుండాల రమేష్, ఎంబేటి చంద్రయ్య, కే.నారాయణ, జోగి శివకుమార్, పామంజి మణి, బుడతాటి చంద్రయ్య, బీవీ రమణయ్య, టీ.వెంకట్రామిరెడ్డి, సురేష్, అడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# అల్లీపురంలో.. టిడ్కో గృహాలు పంపిణీ

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అల్లీపురంలో ఈనెల 13న నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర‌రెడ్డి అధ్యక్షతన లబ్ధిదారులకు టిడ్కో గృహాలను పంపిణీచేశారు. ఆ ఇళ్ల తాళాలను లబ్ధిదారులకు రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, కాకాణి గోవర్ధన్ రెడ్డిలు అందజేశారు. పేదవారికి సొంత ఇంటిని నిర్మించి ఇవ్వాలన్న సంకల్పంతో ప్రభుత్వం నిర్మించిన ఈ టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమం జాతరలా జరిగింది. సొంత ఇంటిని పొందేందుకు వేలాదిగా లబ్ధిదారులైన మహిళలు హాజరయ్యారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 12వ డివిజన్ అల్లీపురం గ్రామంలో నిర్మించిన 15,500 టిడ్కో గృహాలను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కలసి పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, నగర వైసీపీ ఇన్‌చార్జి మహమ్మద్ ఖలీల్ అహ్మద్, టిడ్కో ఛైర్మెన్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

### జెఇఇ మెయిన్స్‌లో..

# సత్తా చాటుకున్న 'నారాయణ' విద్యార్థులు




జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో నెల్లూరులోని నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటుకున్నారు. 300 మార్కులకు 300 సాధించి జాతీయస్థాయిలో తమ విద్యార్థి షేక్ నూరజ్ 100 పర్సంటైల్‌ను సాధించడం విశేషమని విద్యాసంస్థల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా తమ విద్యాసంస్థలకు చెందిన బి.రితేష్‌రెడ్డి 99.92, ఏ.శ్రీనికేష్ 99.91, జె.చరితసాయి సుష్మా 99.90, ఎం.లావణ్యచంద్రిక 99.83, పి.అభితేష్, పి.సాయినితీష్‌లు 99.77, విఆర్.దినేష్‌కార్తీక్ 99వ74, ఎం.శ్రీరామ్‌సుహాస్ 99.72, ఏ.విరించి 99.71 పర్సంటైల్ సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి నారాయణ, జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. వీరితో పాటు 31 మంది 99 పర్సంటైల్‌కుపైగా, 57మంది 98 పర్సంటైల్‌కుపైగా, 80మంది 97 పర్సంటైల్‌కుపైగా, మరో 126 మంది 95 పర్సంటైల్, 225 మంది 90 పర్సంటైల్‌కు పైగా సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలతో రాణించిన విద్యార్థులందరినీ కళాశాలలో ఈనెల 13న జరిగిన కార్యక్రమంలో వారు అభినందించారు.

# యోగాలో చాంపియన్.. అరుణకుమారి

- కొలొంబోలో సత్తాచాటిన నెల్లూరీయురాలు



నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేటకు చెందిన యోగా సాధకురాలు పి.అరుణకుమారి అంతర్జాతీయ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమస్థానం సాధించి నెల్లూరు పేరు మారుమోగించింది. ఇటీవల శ్రీలంకలోని కొలంబోలో జరిగిన యోగా ఫెడరేషన్ ఆఫ్ ఏషియా అండ్ శివ-విష్ణు యోగా పీఠం నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో అరుణకుమారి విజేతగా నిలవడంతో నెల్లూరులోని యోగామాస్టర్లు, యోగా సాధకులు ఆమెను అభినందించారు.



నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెంలో ఉజ్వల యోజన పథకం కింద పేద మహిళలకు ఇటీవల ఉచిత గ్యాస్ కనెక్షన్లను అందజేస్తున్న టిడిపి నాయకుడు పొన్నాల రామచంద్రారెడ్డి

# టీడీపీ నకిలీ సర్వేలను నమ్మొద్దు!

## కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందంటూ టీడీపీ వారు నకిలీ సర్వేలను సృష్టించి జనంలోకి వదులుతున్నారని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చెప్పారు. ఈనెల 13న ఆయన కోవూరులోని పీవీఆర్ కల్యాణమండపంలో పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబుకు వత్తాసుగా మాట్లాడే వారు మినహా అన్ని సంస్థల సర్వేల్లో ఎన్నికల్లో గెలిచేది వైఎస్సార్సీపీయేనని, జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేస్తున్నాయన్నారు. ఓటమి భయంతోనే టీడీపీ పొత్తులతో రంగంలోకి వస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో వైకాపా ఎంతో బలంగా ఉందని, తెదెపా మాత్రం ఎన్నికల్లో అభ్యర్థుల కోసం వెతుక్కునే స్థితిలో ఉందని అన్నారు. 'బీజేపీ-టీడీపీ-జనసేన కలసి పోటీ చేస్తే వైకాపాకు 117 సీట్లు వస్తాయని, అలాకాక వారు ముగ్గురూ విడిపోతే వైకాపాకు 132 సీట్లు వస్తాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పకుండా మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారు..ఇది నా సర్వే.. నేను చెప్పింది జరుగుతుంది. కావాలంటే రాసిపెట్టుకోండి' అని ఆయన ధీమాగా చెప్పారు. ఎన్ని శక్తులు ఒకటైనా సింహం సింగిల్‌గా వస్తుందని, ఎంతమంది కలిసినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని, ఎన్నికల్లో వైకాపా తిరుగులేని విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# భక్తిశ్రద్ధలతో.. తై అమావాస్య


## భక్తులతో క్రిక్కిరిసిన వేమాలశెట్టి బావి ప్రాంగణం



తై అమావాస్య తిరునాళ్ళను పురస్కరించుకుని ఈనెల 9న నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం..ఆరోగ్యప్రదాత..శ్రీ వైద్య వీర రాఘవస్వామి దేవాలయం ప్రాంగణం, వేమాలశెట్టిబావి ప్రాంతమంతా భక్తులతో క్రిక్కిరిసిపోయింది. తెలుగు-తమిళ భక్తులు పెద్దసంఖ్యలో దేవాలయం వద్దకు చేరుకుని సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శివ లింగంపై ఆచారం ప్రకారం మిరియాలు, ఉప్పు పోసి పూజలు చేశారు. అనంతరం, వేమాలశెట్టిబావిలో బెల్లం వేసి, కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆరోజు ఉదయం నుంచి రాత్రి దాకా భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు.


# ఏడుగురిని మింగేసిన.. రోడ్డు ప్రమాదం

## ➤ ముసునూరు వద్ద దారుణం



కావలి సమీపంలోని ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. వీరిలో అయిదుగురు అక్కడికక్కడే మరణించగా, ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ దుర్ఘటన జిల్లాలో సంచలనం కలిగించింది. రహదారిపై వెళ్తున్న రెండు వాహనాలను ఒక లారీ ఢీకొనడంతో ఈ ఘోరం జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కావలి జాతీయ రహదారిపై వేకువన 2.30గంటల ప్రాంతంలో చెన్నై వైపు ఇనుప కమ్ముల లోడుతో వస్తున్న లారీ, ఆవుల లోడుతో వెళ్తున్న లారీని ఢీకొని అదుపు తప్పడంతో పాటు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను దాటేసి అవతలి మార్గంలో వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సును వేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. రెప్పపాటులో ఈ ఘోరం జరిగిపోయింది. ఆ సమయంలో బస్సులో నిద్రలో ఉన్న ప్రయాణీకులంతా వాహనాలు ఢీకొన్న శబ్దానికి ఒక్కసారిగా ఉలిక్కిపడి బెంబేలెత్తిపోయి హాహాకారాలు చేశారు. ఏం జరిగిందో తెలుసుకునేలోగానే పలువురు తీవ్రగాయాలపాలై మృత్యువాత పడ్డారు. ఈ మూడు వాహనాల డ్రైవర్లతో పాటు, మరో నలుగురు ప్రయాణీకులు మృత్యువాత పడ్డారు. వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వాహనాలు నుజ్జునుజ్జయిపోయాయి. లారీ డ్రైవర్ దీపక్, క్లీనర్ వేణు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, తీవ్రంగా గాయపడిన బస్సు డ్రైవర్ తంబిరామ్, బస్సులో ప్రయాణిస్తున్న తంబిస్వామి, అట్టల్ రూప, అంజూరి సురేష్‌లు చికిత్స పొందుతూ మరణించారు. మరో గుర్తు తెలియని ప్రయాణీకుడు కావలి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. మరో పాతిక మందికి పైగానే ప్రయాణీకులు ఈ రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై విలవిలలాడారు. ప్రమాదానికి కారణమైన లారీని ఆ సమయంలో క్లీనర్ వేణు నడుపుతున్నట్లు తెలుస్తోంది. డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని క్లీనర్‌కు అప్పగించడం, క్లీనర్ వేగంగా లారీని నడపడమే కాక నిద్రమత్తులో ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే కావలి పోలీసులు హుటాహుటిన రంగంలోకి దిగి బాధితులను ఆసుపత్రులకు చేర్చారు. నుజ్జునుజ్జయిన వాహనాల్లోంచి అతికష్టంమీద క్రేన్ల సహాయంతో పక్కకు తొలగించి, గాయాలపాలై అల్లాడుతున్న వారిని బయటకు తీసి కాపాడారు.

# కల్యాణ వైభవం...!



తేజ - గ్రీష్మ

నెల్లూరు, మాగుంట లే అవుట్ వాస్తవ్యులు ఎం.శ్రీధర్‌రెడ్డి - రమాదేవిల కుమారుడు **డా. సాయి తేజ - కమల్ గ్రీష్మ** (నెల్లూరు శ్రీధర్‌రెడ్డి - గాయత్రిల కుమార్తె)ల వివాహం ఈ నెల 11వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.



లిఖిత - రాజశేఖర్

కోవూరు మండలం, లేగుంటపాడు వాస్తవ్యులు నిడిముసిలి మల్లిఖార్జునరెడ్డి - సురేఖల కుమార్తె **లిఖిత - రాజశేఖర్** (చిట్టమూరు మండలం, గునుపాటిపాళెం వాస్తవ్యులు మారంరెడ్డి శ్రీనివాసులురెడ్డి - చందనల కుమారుడు)ల పరిణయం ఈ నెల 14వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

# అష్టలక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

## ప్రారంభించిన శ్రీ దత్త విజయానందతీర్థ స్వామీజీ



నెల్లూరు దర్గామిట్టలోని సుజాతమ్మ కాలనీలో కొలువైవున్న శ్రీకృష్ణయోగ మందిరం, అష్టలక్ష్మి ఆలయానికి ఈనెల 14న మైసూరులోని దత్తపీఠం ఉత్తరాధీశ్వరులు..శ్రీ దత్త విజయానందతీర్థ స్వామీజీ విచ్చేసి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు, ఎస్‌జీఎస్‌కేజేబీఎస్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ఆలయ ట్రస్టీలు, అర్చకులు స్వామీజీని పూర్ణకుంభంతో స్వాగతించారు. అనంతరం స్వామీజీ ఆలయంలోని శ్రీకృష్ణ మందిరం, అష్టలక్ష్మి ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని, శివాలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాల ప్రాంగణంలో ఇటీవల ఆధునీకరించిన ధ్యానమందిరానికి ఈ సందర్భంగా స్వామీజీ ప్రారంభోత్సవం చేశారు. రథసప్తమిని పురస్కరించుకుని 16న దేవస్థానంలో జరగనున్న శ్రీచక్రార్చన, మహాసౌర హోమంలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆలయాలను దర్శించుకున్నారు. ట్రస్టీలు అశోక్‌కుమార్‌రెడ్డి, రేబాల పట్టాభిరామిరెడ్డి, రాజశేఖర్, సురేష్, సీసీ రత్నం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పంటపొలాలకు నీళ్ళేవీ?

## రైతునాయకుల ఆందోళన



వైకాపా నాయకుల మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప, రైతుల పంటపొలాలకు మాత్రం నీళ్ళు రావడం లేదని రైతునాయకులు దుయ్యబట్టారు. ఈనెల 14న జలదంకిలోని సీపీఎం కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావి మాల్యాద్రి మాట్లాడుతూ, పంటలు పండే సమయానికి సాగునీళ్ళు లేకుంటే పరిస్థితి దయనీయంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. చినక్రాక రిజర్వాయరు దాటి దిగువ ప్రాంతాలకు సాగునీళ్ళు రావడం లేదన్నారు. వెంటనే కావలి కాలువకు పుష్కలంగా సాగునీటిని అందించాలని, చినక్రాక రిజర్వాయర్‌కు దిగువనున్న చివరి ఆయకట్టు చెరువులకు నీరందించకుంటే సుమారు 3వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జలదంకి, ఎల్ఆర్ అగ్రహారం, టంకవారిపాళెం గ్రామాలకు చెందిన పలువురు రైతులు, సీపిఐ నాయకుడు దర్గాబాబు, సీపిఎం నాయకుడు ఆంథోనిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆ నమ్మకం తగ్గిందా?

(మొదటి పేజీ తరువాయి)




నిన్నటి వరకు "జగనన్నే మా భవిష్యత్తు" – "మా నమ్మకం నువ్వే జగన్" అన్న వైసీపీ నాయకుల్లో ఇప్పుడు.. ఆ నమ్మకం తగ్గిందా..? అన్న అనుమానాన్ని రాజకీయ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

తొలినుండి గమనిస్తే రాజకీయాలలో జగన్‌మోహన్‌రెడ్డి ఒక కొత్త తరహా పోకడని అవలంభిస్తూ వస్తున్నారు. కార్పొరేట్ తరహా విధానాన్ని ఆయన రాజకీయాలకి పరిచయం చేశారు. తాను ముఖ్యమంత్రి కాకముందు కూడా ఎవరైనా ఆయనని కలవాలంటే తప్పనిసరిగా ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాలన్న నిబంధనని ఆయన ఖచ్చితంగా పాటించేవారు. తనని కలవాలన్న వారిని అందరినీ ఆయన కలిసేవారు కాదు. తాను కలవాలనుకున్న వారికి మాత్రమే ఆయన సమయం ఇచ్చేవారు. ఓదార్పు, పాదయాత్రల పేరుతో ఆయన ప్రజలమధ్య తిరిగే సమయంలో కూడా వ్యక్తిగత సమయాన్ని అతి తక్కువమందికే కేటాయించేవారు. "ఒక్క అవకాశం ఇవ్వండి" అంటూ ఆయన చేసిన అభ్యర్ధన ప్రజలని ఆకట్టుకుంది. తాను కూడా వూహించని విధంగా 151 సీట్లతో ప్రజలు ఆయనకి అవకాశమిచ్చారు. ఆయన తృప్తి చెందలేదు, ఇప్పుడు మొత్తం 175 తనకే కావాలంటున్నారు.

గత ఎన్నికలలో 175 అసెంబ్లీ సీట్లలో, 25 పార్లమెంటు స్థానాలలో పోటీ చేయడానికి నాలుగింతల మంది నాయకులు క్యూ కట్టారు. సీటొస్తే గెలిచిపోతామన్న ధీమాతో అధినాయకుడిని వేడుకున్నారు. అనేక పాట్లు, ఫీట్లు తరువాత మొత్తం 200 మంది అభ్యర్థులను ఎంపిక చేసి బరిలో దించారు. తాను అనుకున్న విధంగానే అధికారాన్ని సాధించుకున్నారు జగన్.

కాలం శరవేగంగా పరిగెత్తింది. జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఐదేళ్లు ముగిసి, మళ్ళీ ఎన్నికలు రానే వస్తున్నాయి. ఈసారి కూడా టిక్కెట్లకి అంతే పోటీ ఉంటుందనుకున్నారు... కానీ, పరిస్థితి తారుమారయ్యింది. సొంత పార్టీలో ఉన్న ఎంపీలు, ఎంఎల్ఏలూ ఒక్కొక్కరుగా జారుకుంటున్నారు. కొత్తవాళ్ళు పెద్దగా ముందుకి రాలేదు. ఉన్న అభ్యర్థులనే అటుకులు చిటుకులుగా అటూ ఇటూ మారుస్తున్నారు.

## ఈ పరిస్థితికి కారకులు ఎవరు?

పోయినసారి అంత ఘనంగా విజయం సాధించిన పార్టీ, ఈసారి గెలుపుకోసం పోరాటం చేయవలసిన పరిస్థితి ఎందుకొచ్చింది? అందుకు కారణాలు ఏమిటి?? కారకులు ఎవరు??? అని వైసీపీ అధినాయకత్వం ప్రశ్నించుకోవలసిన సమయం వచ్చిందని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

**ఒక్కొక్కటిగా పరిశీలిస్తే...**

- జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పెట్టిన నాటినుండి ఆయనని తమ సొంత ఇంటిబిడ్డగా భావించి అహోరాత్రులు జగన్ విజయం కోసం తపించినవారిని జగన్ పట్టించుకోకపోగా, వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమా?
- తమ పార్టీ మంత్రులు, శాసనసభ్యులు ఇష్టారాజ్యంగా అరాచకాలుచేస్తూ ఆగడాలు సాగిస్తూ తాను, తన పార్టీ, తమ కుటుంబ అభిమానులపై కూడా దౌర్జన్యాలు చేస్తుంటే తాను పట్టీపట్టనట్లు చూస్తూ ఊరుకోవడమా?
- శత్రుదుర్భేధ్యమైన భద్రతా వ్యవస్థ మధ్య జీవిస్తూ, ప్రజా పర్యటనలలో సైతం నా అనుకున్న వారిని ఎవరూ తన దగ్గరకి రానివిధంగా తన చుట్టూ భద్రతా వలయాన్ని ఏర్పరచుకుని పర్యటనలు సాగించడమా?
- అధికారంలోకి వచ్చిన క్షణం నుండి ప్రజలతో, నాయకులతో, కనీసం శాసనసభ్యులతో, పార్లమెంటు సభ్యులతో నేరుగా సంబంధాలుపెట్టుకోకుండా మొత్తం పెత్తనమంతా సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పజెప్పడమా?
- నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలు అంటూ తన సొంత సామాజిక వర్గాన్ని పక్కన పెట్టడమా?
- రివర్స్ టెండరింగ్ అంటూ కాంట్రాక్టు విధానానికి చెక్‌పెట్టి ఆ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడమా?
- ఇసుక, మద్యం, మైనింగ్, సిలికా వంటి వ్యాపారుల జీవితాలను చీకటిమయం చేసి ఆ వ్యాపారాలన్నీ ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడమా?
- మూడు రాజధానులు అన్న అంశాన్ని తెరపైకి తెచ్చి, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ పది సంవత్సరాల తరువాత కూడా రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయడమా?
- రాష్ట్ర అభివృద్ధి, నీటి పారుదల ప్రాజెక్టులు, మౌళిక సదుపాయాల కల్పన వంటి అంశాలని పక్కనపెట్టి, మధ్యతరగతి ప్రజలు చెల్లించిన లక్షల కోట్ల రూపాయలను బటన్ నొక్కడం ద్వారా పేదల ఖాతాలలో జమచేసి, వారిని సోమరిపోతులుగా మార్చడమా?
- కొత్త రకం పన్నుల ద్వారా కరెంటు బిల్లును షాక్ కొట్టేలా పెంచడమా?
- ఇంటి పన్ను, చెత్త పన్ను, నీటి పన్నుల వంటి వాటిని అపరిమితంగా పెంచడమా?
- లే అవుట్లలో 5శాతం పేదవారికి కేటాయించాలని నిబంధనపెట్టి, రియల్‌ఎస్టేట్ వ్యాపారాన్ని నీరుగార్చడమా?
- జీఎస్టీ ఉంటే తప్ప అక్రిడిటేషన్ కార్డు ఇవ్వబోమని నిబంధనపెట్టి, పత్రికలనే ఆధారం చేసుకుని బ్రతుకుతుండిన చిన్న పత్రికల వారి కడుపు కొట్టడమా?
- ఫీజుల నియంత్రణ పేరుతో విద్యాసంస్థలపై అజమాయిషీ చెలాయించి వారిని భయభ్రాంతులకి గురిచేయడమా?
- సినిమా టిక్కెట్ల పెంపుపై నియంత్రణ విధించి, సినిమా రంగంలోని అగ్ర తారలందరినీ తన కాళ్ళ దగ్గరకి రప్పించుకోవడమా?
- భారతదేశంలోకెల్లా ఆంధ్రాలో అత్యధికంగా పెట్రోలు, డీజిల్ ధరలు మండుతుంటే చూసీచూడనట్లు వ్యవహరించడమా?
- నిర్భయంగా, నిర్మొహమాటంగా, నిస్సంకోచంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలను జగన్ దృష్టికి తీసుకు వెళ్లగలిగే సొంత మనుషులని తన క్యాంపు కార్యాలయం దరికి కూడా చేరనీయకపోవడమా?

ఇవే కాకుండా జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంలో జరుగుతున్న అనేక పరిణామాలు, వాటి పట్ల ఆయన బృందం వ్యవహరిస్తున్న తీరు ప్రజలని ఆలోచింప చేస్తున్నాయన్నది విశ్లేషకుల భావన. క్రమేణా ఆయనపై నమ్మకం సన్నగిల్లుతోందని, ఇంకా రాబోయే రోజుల్లో మరికొంత మంది అధినేతపై వ్యతిరేక గళం వినిపించడానికి సంసిద్ధమవుతున్నారని విశ్లేషకులు చెప్తున్నారు. కార్పొరేట్ తరహా కార్యనిర్వహణ రాజకీయాలలో సాధ్యం కాదని కూడా వారు అంటున్నారు. రేపు జరగబోయే ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఫలితం భవిష్యత్తులో దేశంలోని అన్ని రాష్ట్రాలకి ఆదర్శం కాబోతోందని కూడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు!

# వైకాపా నుంచి బీజేపీలోకి




రావూరు మండలంలోని గిలకపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ కేతా అమర్‌నాథ్‌రెడ్డి ఈనెల 12న వైకాపా నుంచి బీజేపీలోకి వచ్చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో, వెంకటగిరి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు ఆధ్వర్యంలో ఆయన బీజేపీలో చేరిపోయారు. వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న డాక్టర్ ఏలూరు రామచంద్రారెడ్డితో కలసి బీజేపీలోకి వచ్చిన ఆయన్ను పురందేశ్వరి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, తిరుపతిజిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

### అష్టలక్ష్మి అమ్మవారికి..

# సతీష్‌రెడ్డి పూజలు

నెల్లూరు దర్గామిట్టలోని సుజాతమ్మ కాలనీలో కొలువైవున్న శ్రీకృష్ణయోగ మందిరాన్ని భారత రక్షణశాఖ సలహాదారు, ప్రముఖ శాస్త్రవేత్త గుండ్రా సతీష్‌రెడ్డి ఈనెల 12న దర్శించుకున్నారు. ఆలయంలోని అష్టలక్ష్మి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా అవధూత శ్రీ గణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞానబోధ సభ ట్రస్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, మస్తాన్‌రెడ్డి, ప్రవీణ్, సురేష్ తదితరులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు, వేదపండితులు సతీష్‌రెడ్డిని ఆశీర్వదించారు.

# రథసప్తమి పూజలు

రథసప్తమిని పురస్కరించుకుని ఈనెల 15, 16 తేదీల్లో నెల్లూరు సుజాతమ్మకాలనీలో ఉన్న అవధూత దత్తపీఠం ఆధ్వర్యంలోని శ్రీకృష్ణయోగ-అష్టలక్ష్మీదేవి మందిరంలో పెద్దఎత్తున పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. పూజ్యశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్యానుగ్రహంతో, అవధూత దత్తపీఠం ఉత్తరాధీశ్వరులు శ్రీ దత్త విజయానందతీర్థ స్వామీజీ సమక్షంలో ఈ పూజలు నిర్వహించనున్నామని ఎస్‌జీఎస్‌కెజీబీఎస్ ట్రస్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. 15వ తేది ఉదయం 10 గంటలకు శ్రీసూక్త యాగం, శ్రీచక్రార్చన అనంతరం సాయంత్రం 6.30 గంటలకు దివ్యనామ సంకీర్తనలు, 16వ తేది ఉదయం 6 గంటలకు రథసప్తమి పూజ, ఆదిత్యహృదయ పారాయణం, 10 గంటలకు శ్రీచక్రార్చన, మహాసౌర హోమం, సాయంత్రం 5 గంటలకు శ్రీ సరస్వతీ దేవి పూజ ఉంటాయని, ఈ రెండు రోజులు మధ్యాహ్నం సమయాల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీ లక్ష్మీదేవి కటాక్షానికి, శ్రీ సూర్యనారాయణస్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆయన కోరారు.

# తమ్ముడిపై అక్క అనురాగం

### • భర్తపై అలిగి ఆత్మహత్య

తమ్ముడు ఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేయనున్న సందర్భంగా, కొత్తదుస్తులతో పాటు ఏదైనా బహుమానం ఇచ్చేందుకు ఆ అక్క తన భర్తను డబ్బులు అడిగితే ఇవ్వలేదని ఆమె భర్తపై అలిగి ఆత్మహత్య చేసుకుంది. ఈ దుర్ఘటన ఇటీవల నెల్లూరులోని రాయజీవీధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రింటింగ్ ప్రెస్ నిర్వహించుకుంటున్న శ్రీహరి-కుమారి దంపతులకు ఇద్దరు బిడ్డలున్నారు. కుమారి తమ్ముడు మహేష్ మనుమసిద్ధినగర్‌లో ఇల్లు కట్టించుకుని అక్క-బావ ఇద్దరూ గృహప్రవేశానికి రావాలని ఆహ్వానించాడు. ఈ నేపథ్యంలో తమ్ముడికి కొత్త దుస్తులు ఇవ్వాలని కుమారి తన భర్తకు చెప్పగా, తన వద్ద డబ్బు లేదని చెప్పడంతో, తనవారికి ఇచ్చేందుకు మాత్రం ఎప్పుడూ డబ్బులు ఉండవా అంటూ మనస్తాపానికి గురై ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో చిన్నబజార్ సీఐ బి.అశోక్‌కుమార్, ఎస్ఐ సైదులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పెద్దాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# ఉత్తమ విద్యాబోధనే లక్ష్యం

## 'కృష్ణ చైతన్య' వార్షికోత్సవ వేడుకల్లో పర్వతరెడ్డి

ఉత్తమ విద్యాబోధనే లక్ష్యంగా తమ విద్యాసంస్థలను మరింత పటిష్టం చేయడంతో తమ సంస్థల్లో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని నెల్లూరులోని 'కృష్ణచైతన్య' విద్యాసంస్థల డైరెక్టర్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 10న స్థానిక కస్తూరిదేవి గార్డెన్స్ లో కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల వార్షికోత్సవ వేడుకలు సందడిగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆర్‌వి రామచంద్రారెడ్డి, కళాశాల డైరెక్టర్ ఆర్‌వి కృష్ణారెడ్డితో పాటు పర్వతరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 26 ఏళ్ళ క్రితం ఈ విద్యాసంస్థలను 140 మంది విద్యార్థులతో ప్రారంభించామని, అధ్యాపకులు, ఇతర విభాగాల వారు, తల్లితండ్రులు అందరి కృషితో ఇప్పుడు ఆ సంఖ్య 17వేలకు పెరగడం సంతోషకరమని అన్నారు. తమ విద్యాసంస్థల విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో అన్ని విభాగాల్లో ముందుండడమే కాక, క్రీడల్లోనూ, క్యాంపస్ ఎంపికల్లోను తమ ప్రతిభాపాటవాలను చాటుకుంటున్నారన్నారు. కృష్ణచైతన్య జూనియర్ కళాశాలను ప్రారంభించి నేటికి 18 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వార్షికోత్సవ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులను ఘనంగా సత్కరించారు. అనంతరం, విద్యార్థులు, ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి, డీన్‌లు శిరీష్ బాబు, సుధారాణి, జ్యోతి రామాంజనేయులు రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, రమేష్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# కళాంజలి అనంత్ ప్రతిభ

## • 'పండుటాకులు'కు మరో అవార్డు



షార్ట్ ఫిల్మ్‌లు, స్కిట్‌లు రూపొందించడంలో మన నెల్లూరీయుడు కళాంజలి అనంత్ మంచి ప్రతిభా పాటవాలతో రాణిస్తూ సింహపురి సీమకే కీర్తితెస్తున్నారు. ఆయన ఇటీవల నిర్మించిన 'పండుటాకులు' షార్ట్ ఫిల్మ్ తాజాగా మరో విశిష్టమైన అవార్డును అందుకుంది. ఇటీవల అనంతపురంలో జరిగిన 6వ షార్ట్ ఫిల్మ్స్ ఫెస్టివల్‌లో చెన్నై, ఆంధ్ర, తెలంగాణల నుంచి మొత్తం 78 షార్ట్‌ఫిల్మ్‌లు పోటీపడగా, అందులో 'పండుటాకులు' జ్యూరీ అవార్డు పొందడం విశేషం. గత ఏడాది హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో కూడా ఈ షార్ట్ ఫిల్మ్‌కు ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు అవార్డులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ షార్ట్ ఫిల్మ్‌కు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం కళాంజలి అనంత్ నిర్వహించి 'పండుటాకులు'కు జీవం పోశారు. ఇందులో, ప్రముఖ నటీనటులు అనూష, ధనుంజయ, మునిచంద్ర, బెనర్జీ, లహరి, డాక్టర్ తేజ, డాక్టర్ చెన్నకేశవ, ఎం. ప్రసన్నాంజనేయులు కీలకపాత్రలు పోషించగా, కెకె రామచంద్రమూర్తి మాటలు రాశారు. చైతన్య, సంగీత్ సౌరభ్‌లు సంగీతం అందించారు. క్రిస్టోఫర్ కెమెరా అద్భుతం. కళాంజలి అనంత్ నేతృత్వంలోని లవ్లీ క్రియేషన్స్ రూపొందించిన 'పండుటాకులు'కు తాజాగా జ్యూరీ అవార్డు రావడంతో స్థానిక కళాకారులు అనంత్‌ను అభినందించారు.

## బెస్ట్ క్యామెడీ కిట్‌గా..'ఏటీఎం'



అదే ఫెస్టివల్‌లో నిర్వహించిన స్కిట్స్ పోటీలకు దాదాపు 100 స్కిట్‌లు రాగా, అనంత్ రూపొందించిన 'ఏటీఎం' స్కిట్ ఉత్తమ హాస్య అవార్డును అందుకుంది. ఈ స్కిట్‌లో ప్రముఖ నటులు దువ్వూరు బెనర్జీ, దోర్నాల హరిబాబు, జయచంద్రలది కీలకపాత్ర. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అన్నీ తానే అయి నిర్మించిన ఈ స్కిట్‌కు కూడా అవార్డు రావడం అభినందనీయం!..

# శ్రీ సత్యమ్మతల్లికి పొంగళ్ళు



కలువాయి మండలం తోపుగుంటలో గ్రామదేవత శ్రీ సత్యమ్మతల్లికి ఈనెల 11న గ్రామస్తులు పూల అలంకరణలు, ప్రత్యేకపూజలు చేశారు. ఇళ్ల వద్దనుంచి పాల పొంగళ్ళను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## టూకీగా...



### గొల్లకందుకూరులో పంటల పరిశీలన

నెల్లూరు రూరల్ మండలంలోని గొల్లకందుకూరులో వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు, నాగమోహన్‌లు పర్యటించి వరిపంటను పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఒకవేళ ఏదైనా విపత్తు వచ్చి పంటకు నష్టం జరిగితే ప్రభుత్వ సాయం అందుకునేందుకు రైతులు తమ పంటల వివరాలతో 'ఈ-క్రాప్' నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

### వెంకటరావుపల్లి పాఠశాల తనిఖీ

ఉదయగిరి మండలంలోని వెంకటరావుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలీ ఈనెల 12న ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాబోయే పరీక్షల్లో విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు వారిని తీర్చిదిద్దాలని చెప్పారు. తొలుత రికార్డులు పరిశీలించి పాఠశాల సిబ్బందికి తగు సూచనలిచ్చారు.

### ముదివర్తిపాళెంలో మంచినీటి పథకం పరిశీలన

ఇందుకూరుపేట మండలంలోని ముదివర్తిపాళెం గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి పథకాన్ని ఇటీవల జడ్పీ కొత్త సీఇఓ కన్నమనాయుడు పరిశీలించారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా గ్రామంలో మంచినీటి పథకాల తీరును ఆయన పరిశీలించారు. నీళ్ళ ట్యాంకులు పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ నాగరాజు, ఏఇ హజరత్ తదితరులు పాల్గొన్నారు.

### అల్లిమడుగు సబ్‌సెంటర్‌లో సిబ్బందికి సూచనలు

బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సి పరిధిలోని అల్లిమడుగు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఈనెల 12న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ ఆకస్మికంగా తనిఖీచేశారు. వ్యాక్సినేషన్‌లు జరుగుతున్న తీరును పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో కావలి డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ బ్రిజిత తదితరులు పాల్గొన్నారు.

### కొమరికలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు ఆర్టీసీ డిపో వారి ఆధ్వర్యంలో ఇందుకూరుపేట మండలంలోని కొమరిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు డిపో మేనేజర్ శివకేశవయాదవ్, కరిముల్లా,కంట్రోలర్ గిరిధర్, జలీల్‌బాషా, హెడ్మాస్టర్ దశరథరామిరెడ్డి తదితరులు బహుమతులు అందజేశారు.

### అక్కంపేటలో జడ్పీహైస్కూల్ వార్షికోత్సవం

మనుబోలు మండలం అక్కంపేట గ్రామంలో నారపరెడ్డి సీతారామిరెడ్డి జడ్పీ ఉన్నతపాఠశాల ప్రథమ వార్షికోత్సవం ఈనెల 11న ఘనంగా జరిగింది. వివిధ క్రీడల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులిచ్చారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ జాంబవతమ్మ, ఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కావలిలో క్యాన్సర్ బాధితురాలికి సాయం

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కావలిలోని పోలిశెట్టి మస్తానమ్మకు ఈనెల 11న కావలి 'బెస్ట్ వాకర్స్' అసోసియేషన్ తరఫున 10,500 రూపాయలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ వాకర్స్ అధ్యక్షుడు శేషయ్య, ఉపాధ్యక్షుడు రమేష్, సభ్యులు భాస్కరనాయుడు, గోపాల్, బుచ్చి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, బాషా తదితరులు పాల్గొన్నారు.

### జంగంరెడ్డిపల్లి వాటర్‌ప్లాంట్ కోసం స్థల పరిశీలన

వరికుంటపాడు మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి రూ. 5 లక్షల జడ్పీ నిధులతో కొత్తగా మంజూరైన మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకోసం ఈనెల 12న ఆర్‌డబ్ల్యుఎస్ డీఇఇ లక్ష్మణ్‌నాయక్, మండల జేసిఎస్ కన్వీనర్ బి.వెంకటేశ్వర్లురెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు పి.మల్లికార్జున తదితరులు స్థల పరిశీలన చేశారు. వైకాపా నేత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సంస్కరణల 'సింహాని'కి 'భారతరత్న'



**తెలుగుజాతి ముద్దుబిడ్డ, ఆర్థిక సంస్కరణల పితామహుడు, బహుభాషా కోవిదుడు, రాజనీతిజ్ఞుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఎట్టకేలకు దేశంలోని అత్యున్నతమైన 'భారతరత్న' పురస్కారం లభించడం తెలుగువారికే కాదు, భారతావనికే గర్వకారణం. కాంగ్రెస్‌పార్టీ నేత అయిన పీవీకి ఈ అత్యున్నత పురస్కారం ప్రకటించి ప్రధాని మోడీ సారధ్యంలోని బీజేపీ ప్రభుత్వం తన ప్రత్యేకతను చాటుకోవడం విశేషం. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి కేంద్రప్రభుత్వం ఏకంగా అయిదుగురికి 'భారతరత్న' పురస్కారాలను ప్రకటించడం అరుదైన విషయం. అందులో ఇద్దరు మాజీ ప్రధానులు చౌదరి చరణ్‌సింగ్, పీవీ నరసింహారావులతో పాటు బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్, బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ అద్వాణీ, ప్రఖ్యాత వ్యవసాయశాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌లు ఉన్నారు. నవభారత రూపశిల్పి, దేశానికి అత్యున్నత సేవలందించిన పీవీకి 'భారతరత్న' రావడంతో తెలుగువారితో పాటు భారతీయులు పులకించిపోతున్నారు. దేశం కష్టకాలంలో ఉన్నప్పుడు తన మేధస్సుతో ఆర్థికసంస్కరణలు చేపట్టి గట్టెక్కించిన ఆ మహామేధావికి ఇది సరైన గుర్తింపు అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.**

పీవీ..అంటేనే తెలుగుజాతికే ఠీవి. ఉన్నతమైన ఆశయాలు..రాజకీయాల్లో నైతిక విలువలు కలిగిన రాజనీతిజ్ఞులాయన. కేంద్రంలో తగిన సంఖ్యాబలం లేని మైనార్టీ ప్రభుత్వాన్ని అత్యంత అమోఘంగా నిర్వహించి కాంగ్రెస్‌పార్టీ నేతృత్వంలో అయిదేళ్లపాటు(1991–1996) పూర్తి కాలం ప్రధానిగా దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపించిన అపర చాణుక్యుడు.. మహామేధావి మన పీవీ. దేశం అప్పుల పాలవుతున్న క్లిష్టపరిస్థితుల్లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన పీవీ, ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్‌తో కలసి ఆర్థికసంస్కరణలకు శ్రీకారంచుట్టారు. సరళీకరణ విధానాలతో సంయమనంతో పనిచేసి దేశాన్ని కష్టాలనుంచి ఒడ్డుకు చేర్చారు. పేదలకు ఉపాధిహామీ పథకం, ప్రజాపంపిణీ వ్యవస్థ వంటివి పీవీ మేధస్సు నుంచి వచ్చిన సంస్కరణలే.

## పల్లె నుంచి ఢిల్లీ దాకా..

పీవీ పుట్టింది నాటి ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట మండల లక్నేపల్లి గ్రామం. 1921 జూన్‌లో ఆయన రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు జన్మించారు. కరీంనగర్‌జిల్లా వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు–రుక్మిణమ్మ దంపతులకు సంతానం లేని కారణంగా పీవీని దత్తత తీసుకోవడంతో, నాటినుంచి ఆయన పాములపర్తి వెంకట నరసింహారావు (పీవీ) అయ్యారు. వంగరలో ప్రాథమిక విద్య తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యలభ్యసించారు. అప్పట్లో నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా పీవీ గళం విప్పి, వారు నిషేధించిన 'వందేమాతరం' గీతాన్ని ఎంతో ధైర్యంగా విద్యార్థులతో కలసి గానం చేశారు. దాంతో ఆయన కళాశాల నుంచి బహిష్కరణకు గురై, నాగపూర్‌కు వెళ్లిపోయారు. అక్కడే చదువుకుంటూ ఎల్ఎల్‌బి పూర్తి చేశారు. చిన్నతనం నుంచి మాతృభక్తి, దేశభక్తితో ఎదిగారు. ఎంతో కృషి.. పట్టుదలతో బహుభాషలు నేర్చి, దేశవిదేశాల్లో భారత ఖ్యాతిని నిలిపారాయన. 17 భాషల్లో ప్రావీణ్యం సంపాదించారంటే పీవీ పట్టుదలకు ఇంతకంటే ఏం నిదర్శనం కావాలి?..

## కార్యకర్త నుంచి.. ప్రధాని దాకా..

రాజకీయాలంటే ఆయనకెంతో ఆసక్తి. 1938లో కాంగ్రెస్‌లో సాధారణ కార్యకర్తగా చేరి, 1939లో త్రిపురలో జాతీయ కాంగ్రెస్ మహాసభల్లో పాల్గొన్నారు. 1957లో కాంగ్రెస్ అభ్యర్థిగా మంథని నుంచి పోటీచేసి శాసనసభ్యునిగా గెలిచారు. వరుసగా 1962, 1967, 1972లో కూడా ఆయన అక్కడ నిలిచి గెలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి అయ్యారు. తొమ్మిదేళ్లపాటు న్యాయశాఖ, సమాచార శాఖ, వైద్యం, దేవాదాయశాఖల మంత్రిగా తనదైన శైలితో పనిచేసి ఆ పదవులకే వన్నె తెచ్చారు. 1971లో ఆంధ్రరాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పీఠాన్ని అధిరోహించారు. 1977లో హనుమకొండ లోక్‌సభ నుంచి పోటీచేసి గెలిచి దేశరాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1980లోనూ అక్కడ గెలిచారు. 1984, 1989లలో మహారాష్ట్రలోని రాంటెక్ నుంచి ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రభుత్వాల్లో హోంశాఖ, రక్షణ శాఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖల్లోనూ ఆయన రాణించారు. 1991లో రాజకీయాల నుంచి విరమించాలనే భావనలో ఉండగా, రాజీవ్‌గాంధీ హత్యానంతరం జరిగిన రాజకీయమార్పుల్లో అనూహ్యంగా పీవీకి ప్రధాని పదవి లభించింది. ఆ తర్వాత 1991 ఉప ఎన్నికల్లో ఆయన కర్నూలు జిల్లా నంద్యాల లోక్‌సభ స్థానం నుంచి గెలిచి, అయిదవసారి లోక్‌సభ సభ్యులయ్యారు. వివాదరహితుడైన పీవీ భారత ప్రధాని పదవిని చేపట్టడం, అప్పట్లో దేశంలో ఉన్న అనేకరకాల క్లిష్ట పరిస్థితులను ఆయన ఎంతో సంయమనంతో చక్కదిద్దడం జరిగాయి. 1991 జూన్ నుంచి 1996 మే దాకా ఆయన ప్రధాని పదవిలో ఉన్నారు. బతికినంత కాలం దేశానికి అపూర్వసేవలందించిన ఆయన 2004 డిసెంబరు 23న పరమపదించారు. ఏదేమైనా, దేశంలో అత్యున్నతమైన ప్రధాని పదవిని చేపట్టిన తొలి తెలుగువాడు, దక్షిణ భారతీయుడు..ఒక్క పీవీయే కావడం చరిత్రాత్మకం!..దేశ చరిత్రలోనే అపూర్వం!..









Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com